


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

# అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684

మేడ్చల్-మల్కాజ్‌గిరి | సోమవారం | 18.08.2025 | సంపుటి : 2 | సంచిక :196 | పేజీలు : 8 | వెల : 2/-

MEDCHAL-MALKAJGIRI | Monday | 18.08.2025 | volume : 2 | Issue : 196 | Pages : 8 | Cost : 2/-



విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575




## ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి

# రాధాకృష్ణన్

### ఖరారు చేసిన భాజపా పార్లమెంటరీ బోర్డు

- రాధాకృష్ణన్ తమిళనాడుకు చెందిన మాజీ ఎంపీ
- తెలంగాణ గవర్నర్‌గానూ కొన్నాళ్లు అదనపు బాధ్యతలు
- వచ్చే ఏడాది తమిళనాడు శాసనసభ ఎన్నికలు
- వ్యూహాత్మకంగా ఎంపిక చేసిన కమలం పార్టీ
- ప్రతిపక్ష పార్టీలు కూడా మద్దతిస్తాయని అంచనా
- ఇండీ కూటమిలోని డీఎంకే వ్యతిరేకించదనే యోచన

న్యూఢిల్లీ, ఆగస్టు 17 :

ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థి ఎవరన్న దానిపై ఉత్కంఠ వీడింది. మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ పేరును బీజేపీ ఖరారు చేసింది. ఆదివారం ఢిల్లీలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన బీజేపీ పార్లమెంటరీ బోర్డు సమావేశమై ఈ నిర్ణయం తీసుకుంది. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అమిత్ షాతోపాటు తెలంగాణకు చెందిన కె.లక్ష్మణ్ ఈ సమావేశానికి హాజరయ్యారు. సుదీర్ఘంగా చర్చించిన తర్వాత సీపీ రాధాకృష్ణన్ పేరుకు పార్లమెంటరీ బోర్డు ఆమోదం తెలిపింది. అనంతరం జేపీ నడ్డా మీడియా సమావేశంలో రాధాకృష్ణన్ పేరును ప్రకటించారు. 02

## జీఎస్టీ సంస్కరణలకు

# సహకరించండి

### రాష్ట్రాలకు ప్రధాని మోదీ పిలుపు

### ఢిల్లీలో రూ.11వేల కోట్ల హైవే ప్రాజెక్టుల ప్రారంభం



న్యూఢిల్లీ, ఆగస్టు 17 :

తదుపరి తరం వస్తు సేవల పన్ను (జీఎస్టీ) సంస్కరణలను దీపావళికి ముందే అమల్లోకి తీసుకొచ్చేందుకు సహకరించాలంటూ రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రధాని మోదీ విజ్ఞప్తి చేశారు. ప్రతిపాదిత సంస్కరణలు పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తాయన్నారు. అదేవిధంగా చిన్న, భారీ వ్యాపారులకూ మేలు చేస్తుందన్నారు. దేశ రాజధాని ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో వాహనాల రద్దీని తగ్గించేందుకు దాదాపు రూ.11 వేల కోట్లతో నిర్మించిన ద్వారకా ఎక్స్‌ప్రెస్ వే, అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్-2 ప్రాజెక్టులను ప్రధాని మోదీ ఆదివారం ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. జీఎస్టీ చట్టాన్ని మరింత సరళీకరించాలని, పన్ను రేట్లను సవరించాలని కేంద్రం కృతనిశ్చయంతో ఉందని మోదీ తెలిపారు. మిగతా 2 లో






ఆగస్టు 22న త్రైపాక్షిక

## సమావేశం!

అమెరికా అధ్యక్షుడు యోచిస్తున్నట్లు మీడియా సంస్థలు వెల్లడి 03



బిహార్‌లో ఓట్ల చోరీ

## కానివ్వం

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ 03



అక్టోబరు 2 నుంచి లైసెన్స్‌డ్

## సర్వేయర్ల సేవలు

- నేటి నుంచి రెండో విడత శిక్షణ కార్యక్రమం
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

02

# 23న టీపీసీసీ పీఏసీ భేటీ

- స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై పీఏసీలో చర్చ
- 42%పై పార్టీ పరంగా భేటీలో తీర్మానం
- ఆ తర్వాత ప్రభుత్వ పరంగా ముందుకు



హైదరాబాద్, ఆగస్టు 17 :

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం వీలున్న అన్ని అవకాశాలనూ పరిశీలిస్తోంది. ఈ అంశంపై చర్చించేందుకు టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) ఈ నెల 23న సమావేశం కానుంది. గాంధీభవన్‌లో జరగనున్న ఈ భేటీలో ప్రధానంగా ఈ అంశంపైనే చర్చించి.. పార్టీ పరంగా నిర్ణయానికి రానున్నారు. అనంతరం దానికి అనుగుణంగా రాష్ట్ర మంత్రివర్గంలో సమీక్షించి.. ప్రభుత్వపరంగా నిర్ణయం తీసుకోనున్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తూ అసెంబ్లీ ఆమోదించిన బిల్లు, పంచాయతీరాజ్ ఎన్నికల్లో రిజర్వేషన్లపై ఉన్న పరిమితిని ఎత్తివేస్తూ తీసుకువచ్చిన ఆర్డినెన్సు రెండూ కేంద్ర ప్రభుత్వం వద్ద పరిశీలనలో ఉన్న విషయం తెలిసిందే. అయితే నెలలు గడుస్తున్నా వీటిపై కేంద్రం ఎలాంటి నిర్ణయమూ తీసుకోకపోవడంతో అసెంబ్లీలో తీర్మానం ద్వారా జీవో తీసుకువస్తే ఎలా ఉంటుందన్న దానిపై న్యాయ నిపుణులతో రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు సమీక్షిస్తున్నారు. లేదా స్థానిక ఎన్నికల్లో పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రకటించి ముందుకు వెళ్లాలన్న అంశంపైనా పరిశీలన జరుగుతోంది.



యూరియా అమ్మకాలపై

## టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

- యూరియా సరఫరాలో కేంద్రం విఫలం
- ఈ నెలలో 80 వేల టన్నులు అదనంగా ఇవ్వాలి
- రైతులు అవసరానికి మించి యూరియా కొనొద్దు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

02

కేటాయింపులు జరిగాకే..

# మిగులు జలాలపై చర్చ

- తెలంగాణ తెచ్చుకున్నదే నదీ జలాల కోసం
- మా అవసరాలు తీరకుండా దిగువన ప్రాజెక్టులు కడితే సమస్యగా మారుతుంది
- సముద్రంలోకెళ్లే జలాలు అనడం సరికాదు
- మా ప్రాజెక్టులు పూర్తయి వాటాలు తేలాక మిగిలిన నీటిని వాడుకోవచ్చు
- వాటాలు తేల్చాల్సిన బాధ్యత కేంద్రానిదే
- ఏపీలోని విశాఖపట్నంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



02

నదుల వరద జలాలపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఇరు రాష్ట్రాల వాటా ఎంతెంతో తేలిన తర్వాతే ప్రాజెక్టులు కట్టుకుంటే న్యాయబద్ధంగా ఉంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాజకీయ ప్రయోజనాల కంటే తమకు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని.. తెలంగాణ తెచ్చుకున్నదే నదీ జలాల కోసం, బీడు భూములను సాగులోకి తెచ్చుకోవడం కోసమని చెప్పారు. ఏపీలోని విశాఖ నగర పర్యటనకు వచ్చిన భట్టి ఆదివారం ఉదయం అక్కడ మీడియాతో మాట్లాడారు. సముద్రంలోకి వెళ్లే జలాలు అంటూ ఏపీ నేతలు మాట్లాడటం సరికాదని పేర్కొన్నారు.

## సీఎం చెప్పిన ఊహాజనిత ఫ్యూచర్ సిటీకి

# భవిష్యత్తు లేదు : కేటీఆర్



సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన ఊహాజనిత ఫ్యూచర్ సిటీకి భవిష్యత్తు లేదని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వ్యాఖ్యానించారు. హైదరాబాద్ ఫార్మాసిటీ భూములలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలన్న రేవంత్‌రెడ్డి ఆకాంక్ష నెరవేరదన్నారు. తెలంగాణ ఫార్మాసిటీ భూముల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై కేటీఆర్ మండిపడ్డారు. 02

62వేల క్యూసెక్కుల వరదను వృథాగా

# సముద్రంలోకి వదులుతున్నారు

- 'కాళేశ్వరం'పై మరో కుట్ర
- జలాశయాల మోటార్లు రోజూ ఆన్-ఆఫ్ చేస్తున్నారు



02

# కేటాయింపులు జరిగాకే.. మిగులు జలాల అంశంపై చర్చ

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**విశాఖ:** భవిష్యత్‌లో ఏపీలో కూడా కాంగ్రెస్ బలపడుతుందని, రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. విశాఖలో నిర్వహించిన 'స్టాప్ ఓట్ చోరీ' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా తెలుగు రాష్ట్రాల మధ్య నీటి వివాదంపై స్పందించారు. తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చుకున్నదే నీటి హక్కుల కోసమని, రాష్ట్రంలో ప్రాజెక్టులు పూర్తయ్యి కేటాయింపులు జరిగాకే మిగులు జలాల అంశంపై చర్చలుంటాయని భట్టి స్పష్టం చేశారు. "సముద్రంలోకి వెళ్లే జలాలు అని మాట్లాడటం సరికాదు. గోదావరిపై మేం చేపట్టిన ప్రాజెక్టులు ఇంకా పూర్తి కాలేదు. ఇరు రాష్ట్రాల వాటా తేలిన తర్వాతే ప్రాజెక్టులు కట్టుకుంటే న్యాయంగా ఉంటుంది. రాజకీయ ప్రయోజనాల కంటే మాకు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం. మా ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయిన తర్వాత మిగులు జలాలుంటే వాడుకోవచ్చు. మా అవసరాలు తీరకుండా దిగువన ప్రాజెక్టులు నిర్మిస్తే కేటాయింపుల్లో సమస్య వస్తుంది"అని భట్టి అన్నారు.

# హక్కులను అడగడంలో తప్పులేదు

## సాధించకపోతేనే తప్పు : మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్:** స్వాతంత్ర్యం వచ్చి ఇన్నాళ్లయినా కూడా సామాజిక న్యాయంపై చర్చ జరుగుతోందని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రవీంద్ర భారతిలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సమాఖ్య అధ్యక్షుడు మహేశ్వర్ రాజ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. 'ఎవరెంతో వారికంత న్యాయం జరగాలి' అని రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారని తెలిపారు. ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగేలా రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడే పరిస్థితి వచ్చిందన్నారు. "ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు ఆయుధం. అలాంటి ఓట్లను తొలగించి దుర్భర పరిస్థితులు ఏర్పడేలా చేస్తున్నారు. ఈ పోటీ ప్రపంచంలో మన వర్గాలు విజయం సాధించాలి. మన బాధ్యతగా మార్గదర్శకత్వాన్ని రాబోయే తరాలకు అందించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం బలహీన వర్గాలు.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు న్యాయం జరిగేలా అన్ని కార్యక్రమాలు చేపడుతోంది. మన హక్కుల కోసం అడగడంలో తప్పులేదు. మన హక్కులు సాధించుకోలేకపోతేనే తప్పు. రాబోయే కాలంలో పోటీ ప్రపంచంలో మన వర్గాలు ముందుండాలి"అని మంత్రి పొన్నం అన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి వివేక్ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

# నిర్మాణ రంగంలో స్వదేశీ వస్తువులనే వాడాలి

## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



**హైదరాబాద్:** నగరంలో నిర్మాణ రంగం ఊపందుకుంటుందని, వినియోగదారుల ప్రయోజనాల మేరకు నిర్మాణరంగ సంస్థలు పనిచేయాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. హైటెక్స్‌లో నిర్వహించిన క్రెడాయ్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా వస్తోన్న మార్పుల దృష్ట్యా బిల్డర్స్ స్వదేశీ వస్తువులనే ఉపయోగించాలని సూచించారు. నిర్మాణ రంగానికి ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు. నిర్మాణ రంగ వ్యాపారులు ఇళ్ల నిర్మాణం నాణ్యతలో రాజీ పడొద్దన్నారు. "ఇప్పటికే హైదరాబాద్.. ఐటీ, ఫార్మా రంగాల్లో దూసుకెళ్తోంది. నిర్మాణం రంగంలోనూ దూసుకుపోతోంది. అంతర్జాతీయ విమానాశ్రయాలు, జాతీయ రహదారులు మౌలిక వసతుల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందజేస్తోంది. వరంగల్‌లో విమానాశ్రయం రాబోతోంది. ఆదిలాబాద్‌లోని డిఫెన్స్ ఎయిర్‌పోర్టును ప్రజా ఎయిర్‌పోర్టుగా మారుస్తున్నాం. ఎంఎంటీఎస్ రైళ్లను ఏసీ రైళ్లుగా మారుస్తాం. సాంకేతిక కారణాలతో మెట్రో పెండింగ్‌లో ఉంది. దాన్ని త్వరలోనే పూర్తి చేస్తాం. సికింద్రాబాద్‌లో రూ.720 కోట్లతో రైల్వే పనులు చేస్తున్నాం. హైదరాబాద్-విజయవాడ గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే పూర్తి చేస్తాం"అని కిషన్‌రెడ్డి తెలిపారు.

## 62వేల క్యూసెక్కుల వరదను వృథాగా

# సముద్రంలోకి వదులుతున్నారు

- 'కాళేశ్వరం'పై మరో కుట్ర
- జలాశయాల మోటార్లు రోజూ ఆన్-ఆఫ్ చేస్తున్నారు



**సిద్దిపేట:** ఎల్లంపల్లి ప్రాజెక్టుకు భారీగా వరద వస్తోందని మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఈ ప్రాజెక్టు గేట్లు ఎత్తి 62 వేల క్యూసెక్కుల వరదను వృథాగా సముద్రంలోకి వదులుతున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పంపులను ఆన్ చేసి రిజర్వాయర్లను నింపాలని డిమాండ్ చేశారు. సిద్దిపేటలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. "కాంగ్రెస్ ప్రభుత్వానికి నీటి విలువ తెలియదు. కృష్ణా, గోదావరిలో వందల టీఎంసీలను వృథాగా సముద్రంలోకి వదులుతున్నారు. కేసీఆర్, హరీశ్‌రావు, భారత రాష్ట్ర సమితి మీద కోపంతో రైతులకు అన్యాయం చేయొద్దు. బురద రాజకీయం చేస్తూ వరదను వృథాగా పోనీయొద్దు. గోదావరి పరివాహకంలో చాలా జలాశయాలు, చెరువులు ఖాళీగా ఉన్నాయి. కాళేశ్వరం కూలిందనే దుష్ప్రచారాన్ని నిజం చేసేందుకు మోటార్లు ఆన్ చేయడం లేదు. మిడ్ మానేరులో ఇంకా 20 టీఎంసీల నీరు నిండాల్సి ఉంది. దీన్ని నింపితే యాసంగిలో రైతులకు మేలు కలుగుతుంది. ఎల్లంపల్లి నుంచి వెంటనే రోజుకు 2 టీఎంసీల నీళ్లు ఎత్తిపోయాలి. ఎల్లంపల్లిలో 7 మోటార్లు ఉంటే రెండింటిని మాత్రమే నడుపుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రోజుకు 2 టీఎంసీల నీళ్లు ఎత్తిపోయొచ్చు. కాంగ్రెస్ ప్రభుత్వం మోటార్లు ఆన్ చేయకుంటే మేం వెళ్లి ఆన్ చేస్తాం. దురుద్దేశంతో మేడిగడ్డ పిల్లర్లకు మరమ్మతులు చేయడంలేదు. మేడిగడ్డ ప్రాజెక్టు మొత్తం కూలిపోవాలని కుట్ర చేస్తున్నారు" అని హరీశ్‌రావు విమర్శించారు.

# ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి రాధాకృష్ణన్

**న్యూఢిల్లీ, ఆగస్టు 17 :** కేంద్రంలో అధికారంలో ఉన్న జాతీయ ప్రజాస్వామ్య కూటమి(ఎన్డీయే) ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా మహారాష్ట్ర గవర్నర్ చంద్రపురం పొన్నుస్వామి రాధాకృష్ణన్(67) పేరు ఖరారైంది. ఆదివారం సాయంత్రం భాజపా ప్రధాన కార్యాలయంలో ప్రధాని మోదీ, పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆధ్వర్యంలో జరిగిన భాజపా పార్లమెంటరీ బోర్డు సమావేశంలో ఆయన పేరును ఎంపిక చేశారు. తమిళనాడుకు చెందిన సీపీ రాధాకృష్ణన్ ప్రస్తుతం మహారాష్ట్ర గవర్నర్‌గా సేవలందిస్తున్నారు. అంతకుముందు ఝార్ఖండ్ గవర్నర్‌గా ఉన్న సమయంలో తెలంగాణ గవర్నర్‌గానూ అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. ఆరెస్సెస్ నేపథ్యం ఉన్న రాధాకృష్ణన్ ఓబీసీ నేత, తమిళనాడులో బలమైన గౌండర్ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి. రెండుసార్లు కోయంబత్తూరు నుంచి లోక్‌సభ ఎంపీగా విధులు నిర్వహించిన రాధాకృష్ణన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని విపక్షాలకు నడ్డా పిలుపునిచ్చారు. లోక్‌సభ, రాజ్యసభ ఎలక్టోరల్ కాలేజీలో ఎన్డీయేకు మెజారిటీ ఉండటంతో రాధాకృష్ణన్ ఎన్నిక దాదాపు ఖాయంగానే కనిపిస్తుంది.

### దక్షిణాదికి ప్రాధాన్యం దక్కేలా..

దక్షిణాది రాష్ట్రాల నాయకులపై భాజపా నాయకత్వం చిన్నచూపు చూస్తోందన్న అపవాదును సరిదిద్దుకొనే ప్రయత్నంలో భాగంగానే సీపీ రాధాకృష్ణన్‌ను ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపిక చేసినట్లు కనిపిస్తోంది. దక్షిణాది భాజపాలో అత్యంత సీనియర్ కావడం, ఆరెస్సెస్ మద్దతు ఉండటం, 2026లో తమిళనాడు ఎన్నికలు జరగనుండటం లాంటి కారణాలతో భాజపా రాధాకృష్ణన్ అభ్యర్థిత్వం వైపు మొగ్గుచూపినట్లు తెలుస్తోంది. ఉపరాష్ట్రపతిగా వెంకయ్య నాయుడు పదవీ కాలం పూర్తయిన తర్వాత దక్షిణాది రాష్ట్రాలకు సరైన ప్రాతినిధ్యం లభించలేదన్న అభిప్రాయం ఎక్కువగా వినిపించింది. ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిల్లీలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఇదే విషయాన్ని ప్రస్తావించడంతోపాటు, దక్షిణాది నుంచి మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. . 2022లో లోక్‌సభ, రాజ్యసభకు సభాపతులుగా ఓంబిర్లా, జగదీప్ ధన్‌ఖడ్‌లు ఎన్నికయ్యారు. ఇద్దరూ రాజస్థాన్‌కు చెందినవారే కావడంతో ప్రాంతీయ సమతుల్యం దెబ్బతిందని అప్పట్లో విమర్శలు వచ్చాయి. 17వ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా రాధాకృష్ణన్‌ను ఎంపిక చేయడంతో భాజపా లెక్క సరిచేసుకున్నట్లు కనిపిస్తోంది. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి పదవులకు భాజపా నాయకత్వం గవర్నర్లనే ఎంచుకుంటోంది. మోదీ అధికార బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి 2017లో జరిగిన రాష్ట్రపతి ఎన్నికలో అప్పటి బిహార్ గవర్నర్ రామ్‌నాథ్ కోవింద్‌కు అవకాశం కల్పించారు. 2022లో రాష్ట్రపతిగా పోటీచేసిన ద్రౌపదీముర్ము 2015 మే నుంచి 2021 జులై వరకు ఝార్ఖండ్ గవర్నర్‌గా సేవలందించారు. 2022లో ఉపరాష్ట్రపతి పదవికి పోటీచేసిన జగదీప్ ధన్‌ఖడ్ అప్పటికి పశ్చిమబెంగాల్ గవర్నర్‌గా ఉన్నారు. ఇప్పుడు వారి సరసన సీపీ రాధాకృష్ణన్ చేరనున్నారు. ఆరెస్సెస్‌తో భాజపాలకు కొత్త అయిన జగదీప్ ధన్‌ఖడ్‌ను రెండో అత్యున్నత రాజ్యాంగ పీఠంపై కూర్చోబెట్టి కొంత చేదు అనుభవాన్ని చవిచూసిన భాజపా నాయకత్వం ఈసారి ఆచితూచి వ్యవహరించింది. ప్రభుత్వం, పార్టీ వ్యవహారశైలి గురించి క్షుణ్నంగా తెలిసిన వ్యక్తిని ఎంచుకొంది.



# జీఎస్టీ సంస్కరణలకు సహకరించండి

(మొదటిపేజీ తరువాయి)

"సంస్కరణలు సుపరిపాలన పురోగతిని సూచిస్తాయి. ఈ కారణంగానే నిరంతర అభివృద్ధికి మేం ప్రాధాన్యం ఇస్తాం. సమీప భవిష్యత్తులో ప్రజల జీవన పరిస్థితులు, వ్యాపార కార్యకలాపాలు మరింత సులభతరంగా, సౌకర్యవంతంగా మార్చడం లక్ష్యంగా జీఎస్టీలో సంస్కరణలను తీసుకొస్తున్నాం. వచ్చే దీపావళికి ప్రజలు పండుగను మరింత సంతోషంగా జరుపుకొనేలా ఈ సంస్కరణలు రెట్టింపు ప్రయోజనాలను కలిగిస్తాయి" అని మోదీ పేర్కొన్నారు. జీఎస్టీ సంస్కరణల ప్రతిపాదిత ముసాయిదాను కేంద్రం అన్ని రాష్ట్రాలకు పంపిందన్నారు. ప్రతిపక్షాలు అధికారంలో ఉన్నప్పుడు తిరోగమన చట్టాలను కొనసాగించాయని మోదీ ఆరోపించారు. రాజ్యాంగాన్ని తలపై పెట్టుకుని నృత్యం చేసేవారు దానిని తుంగలో తొక్కారని, బీఆర్ అంబేడ్కర్ భావాలకు ద్రోహం చేశారని ఆయన తీవ్రంగా విమర్శించారు.

# యూరియా అమ్మకాలపై టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

- ఈ నెలలో 80 వేల టన్నులు అదనంగా ఇవ్వాలి
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్:** యూరియా అమ్మకాలపై టాస్క్‌ఫోర్స్ ద్వారా తనిఖీలు నిర్వహించాలని, అక్రమాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. రాష్ట్ర ఎంపీలు సోమవారం పార్లమెంటులో కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జేపీ నడ్డాను కలిసి తక్షణమే 3 లక్షల టన్నుల యూరియా సరఫరా కోసం వినతిపత్రం సమర్పిస్తారని వెల్లడించారు. సచివాలయంలో ఆదివారం ఆయన యూరియా సరఫరాపై సమీక్ష నిర్వహించారు. కార్యదర్శి రఘునందన్‌రావు, సంచాలకుడు గోపి ఇతర అధికారులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..'సీజన్ ముందస్తుగా ప్రారంభం కావడం, మొక్కజొన్న లాంటి పంటల అధిక సాగు వల్ల గతేడాదితో పోలిస్తే పలు జిల్లాల్లో యూరియా అమ్మకాలు అధికంగా జరిగాయి. కలెక్టర్లు యూరియా దుర్వినియోగాన్ని నివారించాలి. రైతులు ప్రతిపక్షాల మాటలు విని యూరియాను ఎక్కువగా కొనొద్దు. కేంద్రం ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు కోటా కింద 8.30 లక్షల టన్నులను కేటాయించింది. ఇందులో స్వదేశీ యూరియా 4.34 లక్షల టన్నులకుగాను 3.27 లక్షల టన్నులు, దిగుమతి యూరియా 3.96 లక్షల టన్నులకు గాను 2.05 లక్షల టన్నులే వచ్చింది. ఈ నెలాఖరు వరకు యూరియా సరఫరా చేయాలని కేంద్రాన్ని కోరుతూ లేఖలు రాయాలి' అని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి దిల్లీలో ఉన్న రాష్ట్ర ఎంపీలకు ఫోన్ చేసి యూరియా సమస్యను పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

# అక్టోబరు 2 నుంచి లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలు

## రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్:** రాష్ట్రంలో భూ సర్వేకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పటిష్ఠ చర్యలు చేపడుతున్నామని, అక్టోబరు 2(గాంధీ జయంతి) నుంచి లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఆదివారం ఆయన భూ కొలతలు, భూ దస్త్రాల నిర్వహణ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..'భూముల రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాప్ తప్పనిసరి చేస్తూ భూభారతి చట్టం అమల్లోకి తీసుకొచ్చిన నేపథ్యంలో లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలు ప్రాధాన్యంగా మారాయి. అవసరమైన సర్వేయర్లను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు మొదటి దశలో ఈ ఏడాది మే 26 నుంచి జులై 26 వరకు జిల్లా కేంద్రాల్లో ఏడు వేల మందికి శిక్షణ ఇచ్చాం. అనంతరం గత నెలాఖరున జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో ప్రాక్టికల్ పరీక్షలు పూర్తి చేశాం. అర్హులకు 40 రోజులపాటు అప్రెంటిస్ శిక్షణ ఇస్తున్నాం. ఈ శిక్షణ పూర్తయిన వెంటనే లైసెన్స్‌లు జారీ చేసి వారి సేవలను సమర్థంగా వినియోగించుకుంటాం. అందుకు వీలుగా సర్వే మాన్యువల్‌ను రూపొందించాలని అధికారులను ఆదేశించాం. రెండో విడత శిక్షణ సోమవారం నుంచి జిల్లా కేంద్రాల్లో ప్రారంభమవుతుంది. శిక్షణకు ఎంపికైన అభ్యర్థులు ఉదయం 10 గంటల లోపు సర్వే విభాగం సహాయ సంచాలకులకు రిపోర్ట్ చేయాలి' అని సూచించారు.

# గ్రామాల సమస్యలపై 21 నుంచి ఆందోళనలు

## భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు



**హైదరాబాద్:** రాష్ట్రంలో గ్రామాలకు నిధులు అందకుండా కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్, గత భారాస ప్రభుత్వాలు పల్లెలను నిర్వీర్యం చేశాయన్నారు. ఆదివారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికలపై పార్టీ రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. ఇందులో భాజపా శ్రేణులకు రామచందర్‌రావు దిశానిర్దేశం చేశారు. గ్రామాల్లోని సమస్యలను ప్రజలకు తెలియజేసేందుకు ఈ నెల 21 నుంచి 25 వరకు 566 మండలాల్లో ర్యాలీలు నిర్వహించాలన్నారు. అనంతరం ఆయా మండలాల తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేసి, ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. ఈ నెల 26 నుంచి సెప్టెంబరు 2 వరకు అన్ని జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు చేపట్టాలని, అనంతరం కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేయాలని చెప్పారు. తాను రంగారెడ్డి జిల్లాలోని ఒక మండలంలో 24 గంటలు బస చేస్తానని, ఆ మండలంలోని ప్రతి గ్రామంలో యువ, మహిళా సమ్మేళనాలు, రచ్చబండ వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు రామచందర్‌రావు వివరించారు. పార్లమెంటు సమావేశాలు ముగిసిన తర్వాత పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు కూడా స్థానిక సంస్థల ఎన్నికల కోసం పని చేయనున్నారని తెలిపారు. సమావేశంలో భాజపా సంఘటనా కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కాసం వెంకటేశ్వర్లు, ప్రేమేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## సీఎం చెప్పిన ఊహాజనిత ఫ్యూచర్ సిటీకి

# భవిష్యత్తు లేదు : కేటీఆర్



**హైదరాబాద్:** సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన ఊహాజనిత ఫ్యూచర్ సిటీకి భవిష్యత్తు లేదని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వ్యాఖ్యానించారు. హైదరాబాద్ ఫార్మాసిటీ భూములలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలన్న రేవంత్‌రెడ్డి ఆకాంక్ష నెరవేరదన్నారు. తెలంగాణ ఫార్మాసిటీ భూముల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై కేటీఆర్ మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫార్మా సిటీ ప్రాజెక్టును రద్దు చేసి, దాని స్థానంలో ఫ్యూచర్ సిటీ అనే అవాస్తవ ప్రాజెక్టును ప్రవేశపెట్టారని కేటీఆర్ దుయ్యబట్టారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం, ఒక నిర్దిష్ట ప్రజా ప్రయోజనం కోసం సేకరించిన భూమిని ఇతరుల ప్రయోజనం కోసం రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులకు మళ్లించడం సాధ్యం కాదని కేటీఆర్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వం హయాంలో 56 గ్రామాల పరిధిలో హైదరాబాద్ ఫార్మాసిటీ కోసం 20వేల ఎకరాలతో ప్రతిపాదనలను తయారుచేశామన్నారు. స్థానిక రైతులు రాష్ట్ర ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి వచ్చి తమ భూములను ఫార్మాసిటీ కోసం ఇచ్చారని కేటీఆర్ తెలిపారు. రైతన్నలు ఫార్మా కంపెనీల కోసం కేటాయించిన భూముల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రజలకు, రైతులకు స్పష్టత ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.



# శ్రీశైలానికి తగ్గుతున్న వరద..

## 3 గేట్ల ద్వారా నీటి విడుదల

**శ్రీశైలం :** శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం క్రమంగా తగ్గుతోంది. ప్రస్తుతం మూడు గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి శ్రీశైలం జలాశయంలోకి 1,78,101 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి 30వేల క్యూసెక్కులు, ఎడమగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 30,315 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 30,492 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నాలుగు స్పిల్‌వే గేట్ల ద్వారా 1,05,876 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 881.5 అడుగుల నీటి మట్టం ఉంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 196.11 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

# రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలపై సమాచారం సేకరిస్తున్నాం : మల్లు రవి



**హైదరాబాద్:** సీఎం రేవంత్‌రెడ్డిపై ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై సమాచారం సేకరిస్తున్నామని, దానిపై తర్వాత జరిగే సమావేశంలో చర్చిస్తామని పీసీసీ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి తెలిపారు. ఆదివారం గాంధీ భవన్‌లో ఆయన అధ్యక్షతన కమిటీ సమావేశం జరిగింది. సభ్యులు శ్యాం మోహన్, కమలాకర్, రామకృష్ణ, నిరంజన్ పాల్గొన్నారు. గజ్వేల్‌లో కాంగ్రెస్ ఎస్సీ విభాగం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్‌పై డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి దాడి చేసిన ఘటనపై కమిటీ విచారణ జరిపింది. విజయ్‌కుమార్, ఆయన అనుచరులు దాడి జరిగిన తీరును వివరించారు. నర్సారెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ వివాదంపై విచారణ కోసం శ్యాంమోహన్ కన్వీనర్‌గా నలుగురు సభ్యులతో కూడిన కమిటీ ఏర్పాటు చేసి..10 రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లు మల్లు రవి మీడియాకు తెలిపారు. ఈ కమిటీ ఈ నెల 19న సమావేశమై విచారణ జరుపుతుందన్నారు. విజయ్‌కుమార్‌పై దాడి ఘటన ఆ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వివేక్ సమక్షంలోనే జరిగిందని, ఆయనను కూడా అడిగి వివరాలు సేకరిస్తామని చెప్పారు. మంత్రి సురేఖ భర్త కొండా మురళి వ్యాఖ్యలపై ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేల అభ్యంతరాలతో ఏర్పడిన వివాదంపై.. వారితో మాట్లాడేందుకు ముగ్గురు సీనియర్ నేతలను సమన్వయకర్తలుగా నియమించాలని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌కు కమిటీ లేఖ రాస్తుందని పేర్కొన్నారు. వరంగల్ నేతల మధ్య సఖ్యత కోసం సమన్వయకర్తలు కృషి చేస్తారన్నారు.

## యుద్ధప్రాతిపదికన రహదారుల

# పునరుద్ధరణ: మంత్రి సీతక్క



**హైదరాబాద్:** రాష్ట్రంలో వర్షాలు, వరదల కారణంగా దెబ్బతిన్న రహదారులకు యుద్ధప్రాతి పదికన మరమ్మతులు చేయాలని, గ్రామాలకు రాకపోకలను పునరుద్ధరించాలని అధికారులను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క ఆదేశించారు. జిల్లా కలెక్టర్ల వద్ద అందుబాటులో ఉన్న నిధులను వినియోగించుకోవాలని సూచించారు. ఆదివారం రోడ్ల మరమ్మతులపై తన కార్యాలయంలో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... "రాష్ట్రంలో వర్షాల వల్ల కలిగిన నష్టాలపై ప్రాథమిక నివేదిక ఆధారంగా వెంటనే అత్యవసర పనులను ప్రారంభించారు. వర్షాలు తగ్గిన వెంటనే రహదారులను శాశ్వత ప్రాతిపదికన పునరుద్ధరిస్తాం. శిథిలావస్థలో ఉన్న భవనాల్లో నివసిస్తున్నవారిని సురక్షిత ప్రదేశాలకు తరలించాలి" అని సూచించారు. మంచిర్యాల జిల్లా భీమిని మండలంలోని కర్జిభీంపూర్, రాజారం, ఆసిఫాబాద్ జిల్లా రాజూర గ్రామాలకు రహదారుల పునరుద్ధరణ పనులను చేపట్టి, వేగవంతంగా పూర్తి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# ఆగస్టు 22న త్రైపాక్షిక సమావేశం!

## అమెరికా అధ్యక్షుడు యోచిస్తున్నట్లు మీడియా సంస్థలు వెల్లడి

**యూఎస్ :** ఉక్రెయిన్‌లో యుద్ధానికి ముగింపు పలకడంపై చర్చించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్ అలాస్కాలో భేటీ అయిన సంగతి తెలిసిందే. అనంతరం త్రైపాక్షిక శిఖరాగ్ర సమావేశం గురించి ట్రంప్ జెలెన్‌స్కీలో ఫోన్‌లో మాట్లాడుకొన్నారు. ఈ నేపథ్యంలో ముగ్గురు అధ్యక్షుల మధ్య ఈ సమావేశం ఆగస్టు 22న ఏర్పాటు చేయాలని అమెరికా అధ్యక్షుడు యోచిస్తున్నట్లు ఆ దేశ మీడియా సంస్థలు పేర్కొన్నాయి. పుతిన్‌తో సమావేశం అనంతరం ఈ విషయాన్ని ట్రంప్ యూరోపియన్ నాయకులతో చెప్పినట్లు సమాచారం.

మరో వైపు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సోమవారం ట్రంప్‌తో భేటీ అవ్వనున్నారు. ఈ సమావేశానికి యూరోపియన్ దేశాల నాయకులను కూడా ట్రంప్ ఆహ్వానించినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. జర్మన్ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ మాట్లాడుతూ.. సోమవారం ట్రంప్, జెలెన్‌స్కీల మధ్య సమావేశం జరిగిన అనంతరం ముగ్గురు నేతల మధ్య త్రైపాక్షిక మీటింగ్ జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. యుద్ధం ముగింపుపై సోమవారం కీలక ప్రకటన వెలువడుతుందని భావిస్తున్నారు. ఉక్రెయిన్‌తో యుద్ధం గురించి ఇటీవల అలాస్కా వేదికగా ట్రంప్, పుతిన్‌లు భేటీ అయ్యి రెండున్నర గంటలకు పైగా చర్చించారు. అయినప్పటికీ ఎలాంటి ఒప్పందానికి రాలేదు. అయితే, చర్చలు సానుకూలంగా జరిగాయని ఇరువురు నేతలు ప్రకటించారు. సమావేశం గురించి ట్రంప్ మాట్లాడుతూ.. ఒప్పందంపై నిర్ణయం జెలెన్‌స్కీ చేతుల్లోనే ఉందన్నారు. అనంతరం అమెరికా అధ్యక్షుడు తనతో ఫోన్‌లో మాట్లాడినట్లు ఉక్రెయిన్ అధినేత తెలిపారు. త్రైపాక్షిక సమావేశంపై ట్రంప్ చేసిన ప్రతిపాదనకు తాను మద్దతిస్తున్నట్లు వెల్లడించారు. కీలక అంశాలపై చర్చించుకునేందుకు అది మంచి వేదిక అవుతుందన్నారు. పరిస్థితులను చక్కదిద్దే బలం అమెరికాకు ఉందని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. శాంతి ఒప్పందంపై ఉక్రెయిన్‌కు మద్దతుగా నిలుస్తున్న యూరోపియన్ నాయకులకు జెలెన్‌స్కీ కృతజ్ఞతలు తెలిపారు.



### జెలెన్‌స్కీకి మద్దతుగా యూరప్ నేతలు..

సోమవారం వాషింగ్టన్ డీసీలో ట్రంప్‌తో జెలెన్‌స్కీ సమావేశమవ్వనున్న నేపథ్యంలో ఐరోపా నేతలు అప్రమత్తమయ్యారు. గతంలో అమెరికా అధ్యక్షుడితో సమావేశమైన జెలెన్‌స్కీకి చేదు అనుభవం ఎదురైన విషయం తెలిసిందే. ఈ ఘటన పునరావృతం కాకుండా ఉండేందుకు ట్రంప్‌తో స్నేహపూర్వకంగా మెలిగే ఫిన్‌లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్‌ను, ఇతరులను ఉక్రెయిన్ అధ్యక్షుడికి సాయంగా వాషింగ్టన్‌కు పంపనున్నట్లు యూరప్ దౌత్యవేత్తలు తెలిపారు. ఇరువురి మధ్య ఘర్షణ పునరావృతం కాకుండా, చర్చలు సజావుగా జరిగేలా వీరు చూసుకోనున్నట్లు సమాచారం. నాటో సెక్రెటరీ జనరల్ కూడా ఈ సమావేశంలో పాల్గొనే అవకాశం ఉందని పొలిటికో పత్రిక కథనం వెలువరించింది.



## బిగ్‌బాస్-2 విజేత ఎల్విష్ యాదవ్ ఇంటిపై 12 రౌండ్ల కాల్పులు

**న్యూఢిల్లీ :** బిగ్‌బాస్ ఓటీటీ(హిందీ) సీజన్-2 విజేత, ప్రముఖ సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ ఎల్విష్ యాదవ్ ఇంటిపై గుర్తు తెలియని దుండగులు భారీగా కాల్పులు జరిపారు. ఆదివారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో గురుగ్రామ్‌లోని అతడి ఇంటి వద్దకు ముగ్గురు గుర్తు తెలియని దుంగడులు బైక్‌పై వచ్చారు. కాసేపు అక్కడే గడిపి.. ఎల్విష్ నివాసంపై 12 రౌండ్ల కాల్పులు జరిపి పరారయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఫోరెన్సిక్ బృందాల సహాయంతో దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని తెలిపారు. భవనంలోని రెండు, మూడో అంతస్తులో ఎల్విష్ కుటుంబంతో సహా నివసిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. దుండగులు జరిపిన కాల్పుల్లో తూటాలు మొదటి అంతస్తులోకి దూసుకువెళ్లాయి. దాడి జరిగిన సమయంలో ఎల్విష్ ఇంట్లో లేడని..అతడి కుటుంబసభ్యులు, కేర్‌టేకర్ ఉన్నారని పోలీసులు చెప్పారు. కేసు నమోదు చేసి, సీసీటీవీ దృశ్యాలను పరిశీలిస్తున్నారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామన్నారు. అయితే ఘటనకు ముందు అతడికి ఎటువంటి బెదిరింపులు రాలేదని కుటుంబసభ్యులు వెల్లడించారు.

### బెట్టింగ్ యాప్‌లు ప్రమోట్ చేసినందుకే: హిమాన్షు భావు గ్యాంగ్

ఎల్విష్ యాదవ్ నివాసంపై దాడి చేసింది తామే అని హరియాణాకు చెందిన గ్యాంగ్‌స్టర్ హిమాన్షు భావు ముఠా ప్రకటించుకుంది. తమ సభ్యులు నీరజ్, ఫౌరిటోలియా ఈ కాల్పులు జరిపినట్లు తెలిపింది. అక్రమ బెట్టింగ్ యాప్‌లను ప్రోత్సహిస్తూ.. ఎల్విష్ చాలా కుటుంబాలను నాశనం చేశాడని అందుకే అతడి నివాసంపై కాల్పులు జరిపామని పేర్కొంది. ఈ యాప్‌లను ఎవరు ప్రమోట్ చేసినా వారి వైపు కూడా తూటాలు దూసుకువస్తాయని హెచ్చరించింది. ఈ ముఠాను నడిపే హిమాన్షు కొన్నేళ్ల కిందట పోర్చుగల్‌కు పారిపోయి.. అక్కడి నుంచే కార్యకలాపాలు నడుపుతున్నాడు.

## మునీర్‌కు ఎలాంటి రాజకీయ ఆశయాలు లేవట..



**ఇస్లామాబాద్:** పాక్ ఆర్మీ చీఫ్ అసీం మునీర్ తనను తాను రక్షకుడిగా చెప్పుకునేందుకు తాపత్రాయపడుతున్నారు. రాజకీయాలు, అత్యున్నత స్థానాలపై పదవీకాంక్ష లేదని. ప్రకటించడం గమనార్హం. దేశసేవ కోసమే భగవంతుడు తనను పుట్టించాడని..ప్రజలను కాపాడటం తప్ప తనకు మరో ఆలోచన ఉండదని అన్నారు. పాకిస్థాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీని బలవంతంగా గద్దెదించి దేశ సైనిక దళాల ప్రధానాధికారి అసిం మునీర్ ఆ స్థానాన్ని ఆక్రమించనున్నారంటూ గతకొద్ది రోజులుగా వస్తున్న వార్తలపై ఆయన స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలో రాజకీయంగా ఉద్రిక్తతలను సృష్టించడానికి కొందరు ఇటువంటి వార్తలను ప్రచారం చేస్తున్నారన్నారు. ఒక స్నేహితుడి కోసం మరో స్నేహితుడిని వదులుకోమని అసీం మునీర్ వ్యాఖ్యానించారు. మిత్ర దేశాలైన అమెరికా, చైనాల మధ్య సమతుల్యతను కాపాడడానికి తాము నిరంతరం కృషి చేస్తామన్నారు. ఆయన వ్యాఖ్యలపై ఆ దేశ ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన రాలేదు. అయితే గతంలో ఈ విషయంపై పాక్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ మాట్లాడుతూ.. "ఫీల్డ్ మార్షల్ అసిం మునీర్ దేశాధ్యక్షుడు కావాలన్న ఆకాంక్షను ఏనాడూ వ్యక్తం చేయలేదు. ఆయనను అలా చేయాలన్న ఆలోచనా లేదు" అని తెలియజేశారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం మునీర్‌కు పాకిస్థాన్ ప్రభుత్వం 'ఫీల్డ్ మార్షల్' హోదాను కట్టబెట్టింది. అదే సమయంలో దేశాధ్యక్షుడిని మార్చడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఊహాగానాలు వినిపించాయి. మునీర్ తరచుగా అమెరికా పర్యటనలకు వెళ్తుండడంతో వీటికి మరింత బలం చేకూరుస్తోంది.

# గవర్నర్‌పై స్టాలిన్ విమర్శలు..

### మరోసారి బయటపడ్డ విభేదాలు



**తమిళనాడు :** తమిళనాడు ప్రభుత్వానికి, ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవికి మధ్య కొంతకాలంగా అభిప్రాయ భేదాలు కొనసాగుతున్నాయి. తాజాగా అవి మరోసారి బహిర్గతం అయ్యాయి. ప్రతిపక్షాల కంటే గవర్నర్ చౌకబారు రాజకీయాలు చేస్తున్నారని ఎంకే స్టాలిన్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆదివారం సాంఘిక సంక్షేమ కార్యక్రమాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'ప్రతిపక్షాలు చేసే విమర్శలపై నాకు ఆందోళన లేదు. ఎందుకంటే రాజకీయాల్లో అవన్నీ సహజం. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం నియమించిన గవర్నర్ రవి.. వారి కంటే చౌకబారు రాజకీయాలు చేస్తున్నారు. రాజ్‌భవన్‌లో ఉండి అధికార డీఎంకేకు వ్యతిరేకంగా అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రం ప్రతిపాదించిన బిల్లులను ఆయన . తమిళ గీతాన్ని అగౌరవపరుస్తారు. కానీ, రాష్ట్రంలో విద్య, శాంతి భద్రతలు, మహిళ భద్రతపై నిరాధారమైన ఆరోపణలు చేసి భయాందోళనలు సృష్టిస్తారు' అని ఆరోపించారు. ఈ సందర్భంగా తమిళనాడు దేశంలోనే అగ్ర రాష్ట్రమని కేంద్ర గణాంకాలే చెబుతున్నాయని స్టాలిన్ పేర్కొన్నారు. దీంతో ప్రజా వేదికలపై గవర్నర్ అసహనం వెళ్లగక్కుతున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తమ గవర్నర్ ద్వారా తమిళనాడులో చౌకబారు రాజకీయాలు చేస్తోందన్నారు. ఇటీవల జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ప్రసంగించిన రవి.. రాష్ట్రంలో మహిళల భద్రత, యువత మాదకద్రవ్యాల వినియోగం సహా పలు అంశాలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలను డీఎంకే నేతలు నాడే తిప్పికొట్టారు. తాజాగా సీఎం స్టాలిన్ కూడా స్పందించినట్లైంది.

## పాక్‌కు చెందిన 30 గ్రూపుల్లో నూర్ మహమ్మద్ సభ్యుడు : ఎస్పీ రత్న



**పుట్టపర్తి:** దేశ సమగ్రతకు అవరోధం కలిగించే కార్యకలాపాల్లో పాల్గొన్నాడన్న సమాచారంతో శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో నూర్ మహమ్మద్‌తో పాటు మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ రత్న తెలిపారు. ఉపా చట్టం కింద నిందితులను అరెస్టు చేశామన్నారు. వీరిద్దరూ నిషేధిత వాట్సప్ గ్రూపుల్లో సమాచారం షేర్ చేసినట్లు గుర్తించామన్నారు. పాకిస్థాన్ ఉగ్రవాదులతో లింకులు ఉన్నాయన్న అనుమానంతో ధర్మవరంలోని కోటకు చెందిన నూర్ మహమ్మద్‌ను ధర్మవరం పోలీసులు శనివారం అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసు వివరాలను ఎస్పీ మీడియాకు వెల్లడించారు. "నిందితులను అరెస్టు చేసి కడప జైలుకు తరలించాం. పాక్‌కు చెందిన వాట్సప్ గ్రూపుల్లో నిందితుడు సభ్యుడిగా ఉన్నాడు. నూర్ మహమ్మద్ చికెన్ బిర్యానీ తయారు చేస్తూ.. అమాయకుడిలా కనిపిస్తాడు. మసీదు వద్ద యువకులకు సమాచారం చేరవేస్తున్నాడు. కౌంటర్ ఇంటెలిజెన్స్ సమాచారం మేరకు అతడిని అరెస్టు చేశాం. కస్టడీలోకి తీసుకొని విచారిస్తాం. ఇతర గ్రూపులతో సంబంధాలపైనా ఆరా తీస్తాం. అతడు ఉగ్రసంస్థ శిక్షణకు పిలిస్తే వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది. నిషేధిత వాట్సప్ గ్రూప్‌లు 6, పాక్‌కు చెందిన మరో 30 గ్రూపుల్లో అతడు సభ్యుడిగా ఉన్నాడు" అని ఎస్పీ రత్న వెల్లడించారు.



## జమ్మూకశ్మీర్‌లో మళ్లీ మేఘ విస్ఫోటం

### ఏడుగురు మృతి

**జమ్మూకశ్మీర్ :** జమ్మూకశ్మీర్‌లోని కిశ్త్‌వాడ్ జిల్లాలో ఇటీవల సంభవించిన క్లౌడ్ బరస్ట్.. పెను విషాదాన్ని మిగిల్చిన సంగతి తెలిసిందే. ఈ ఉపద్రవాన్ని మరువక ముందే కథువా జిల్లాలోని ఘాటీ గ్రామంలో మేఘ విస్ఫోటం సంభవించింది. ఈ విపత్తులో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు గాయపడ్డారని అధికారులు తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో ఈ విస్ఫోటం సంభవించిందని స్థానిక పోలీసు అధికారి తెలిపారు. సహాయక చర్యల నిమిత్తం ఎస్‌డీఆర్ఎఫ్ బృందం ఆ ప్రాంతానికి చేరుకుందని వెల్లడించారు. ఘాటీ సమీపంలోని జుతానా జోడ్ అనే ప్రాంతంలో కొండచరియలు విరిగిపడటంతో శిథిలా కింద ఒక కుటుంబం చిక్కుకున్నట్లు తెలుస్తోంది. భారీ వర్షాల కారణంగా సహాక్ ఖాద్, ఉజ్ నదులలో నీటి శాతం అమాంతంగా పెరిగిపోయిందని అధికారులు తెలిపారు. రైలు పట్టాలు దెబ్బతినడంతో పాటు ఆ ప్రాంతంలోని జాతీయ రహదారితో సహా ప్రధాన మార్గాలపై వాహనాలు నిలిచిపోయాయన్నారు. కథువా పోలీస్ స్టేషన్‌లోకి కూడా వరదనీరు చేరింది. ఈ ఘటనపై కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ఎక్స్ వేదికగా వివరాలు వెల్లడించారు. మేఘ విస్ఫోటంపై సమాచారం అందగానే కథువా పోలీసు అధికారి శోభిత్ సక్సేనాతో మాట్లాడినట్లు తెలిపారు. సహాయక సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకున్నారన్నారు. మృతులకు సంతాపం తెలిపారు. మరోవైపు జిల్లా అధికారులు వాతావరణ హెచ్చరికలు జారీ చేశారు. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్నందున అలాంటి ప్రదేశాలకు దూరంగా వెళ్లాలని కోరారు. ఇటీవల మచైల్ మాతా దేవి దర్శనానికి వెళ్తున్న యాత్రికులపై మేఘ విస్ఫోటం విరుచుకుపడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు సీఆర్‌పీఎఫ్ సిబ్బందితో సహా ఇప్పటి వరకు 60 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 82 మంది గల్లంతయ్యారు.

# బిహార్‌లో ఓట్ల చోరీ కానివ్వం

### కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ



**బిహార్ :** ఎన్నికల సంఘాన్ని లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తన ఆరోపణలను తీవ్రతరం చేశారు. ఓట్ల విషయంలో భాజపాతో కలిసి ఈసీ అవకతవకలకు పాల్పడుతున్నట్లు ఇప్పుడు యావత్ దేశానికి తెలిసిందన్నారు. బిహార్‌లోని సాసారం నగరంలో "ఓటర్ అధికార్ యాత్ర" ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఓటర్ల జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ' పేరిట బిహార్‌లో ఓట్ల తొలగింపు, చేర్పుల వంటి కుట్రలకు తెరలేపారని ఆరోపించారు. 'ఇండియా' కూటమి దీనికి అనుమతించబోదని, పేదల ఓటు అధికారాన్ని వారి నుంచి దూరం కానివ్వబోదన్నారు. "దేశవ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు చోరీకి గురవుతున్నాయి. మహారాష్ట్రలో లోక్‌సభ ఎన్నికల్లో 'ఇండియా' కూటమి సత్తా చాటింది. అసెంబ్లీ ఎన్నికల్లోనూ మాదే విజయమనే అంచనాలు వెలువడ్డాయి. కానీ, నాలుగు నెలల్లోనే కోటి మంది ఓటర్లు వచ్చి చేరడంతో.. భాజపా కూటమి గెలిచింది. ఎక్కడైతే ఓట్లు పెరిగాయో.. అక్కడ కాషాయ పార్టీ గెలిచింది. ఈసీ ఏం చేస్తోందో ఇప్పుడు అందరికీ తెలిసింది. ఓట్ల చోరీ ఆరోపణలపై ఎన్నికల సంఘం నా నుంచి అఫిడవిట్ కోరింది. భాజపా నేతలూ అదే విధమైన వాదనలు చేస్తే.. ఆ ప్రస్తావనే తీసుకురాలేదు. భాజపా, ఆరెస్సెస్‌లు రాజ్యాంగాన్ని దెబ్బతీసేందుకు యత్నిస్తున్నాయి" అని రాహుల్ గాంధీ ఆరోపించారు. కేంద్రంలో భాజపా నేతృత్వంలోని సర్కారు అధికారంలో ఉన్నంత కాలం రాజ్యాంగానికి ముప్పు పొంచి ఉందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ప్రజల ఓటు హక్కును లాక్కునేందుకు యత్నిస్తోందన్నారు. ఎన్నికల సంఘం భాజపా ప్రభుత్వానికి ఏజెంట్‌లా వ్యవహరిస్తోందని వ్యాఖ్యానించారు. బిహార్‌లో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఎన్డీయే సర్కారును గద్దెదించుతారన్నారు. మరోవైపు.. బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణపై ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ప్రజల ఓటు హక్కును కాలరాసేందుకు ఎన్నికల సంఘాన్ని ఉపయోగిస్తోందని ఆయన ఆరోపించారు.



## వాణిజ్య చర్చలు..

### అమెరికా ప్రతినిధుల భారత పర్యటన రద్దు..

**న్యూఢిల్లీ :** రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నారనే కారణంతో భారత్‌పై అమెరికా భారీగా సుంకాల భారాన్ని మోపిన సంగతి తెలిసిందే. ఈ టారిఫ్‌ల వేళ.. మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. వాణిజ్య చర్చల కోసం భారత్‌కు రావాల్సిన అమెరికా బృందం తమ పర్యటనను రద్దు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు పలు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఇటీవల భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 50శాతం సుంకాలు విధించారు. పాత 25శాతం సుంకాలు ఇప్పటికే అమల్లోకి వచ్చాయి. అదనపు 25% టారిఫ్‌లు ఈ నెల 27 నుంచి అమల్లోకి రానున్నాయి. దీనికి ముందే అమెరికాతో వాణిజ్య చర్చలు జరిపి మధ్యంతర ఒప్పందం చేసుకోవాలని న్యూదిల్లీ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. దీనికి సంబంధించి ఇప్పటికే ఇరు దేశాల ప్రతినిధుల మధ్య ఐదు దఫాలు చర్చలు జరిగాయి. ఆరో దఫా చర్చలకు అమెరికా ప్రతినిధులు ఈ నెల 25 నుంచి 29 మధ్య భారత్‌లో పర్యటించాల్సి ఉంది. అయితే, తాజాగా ఆ పర్యటనను వారు రద్దు చేసుకున్నట్లు తెలుస్తోంది. చర్చలకు సంబంధించిన తదుపరి తేదీలు గురించి తెలియలేదు. వ్యవసాయం, పాడి పరిశ్రమ రంగాలకు సంబంధించిన విషయంలో ఇరుదేశాల మధ్య చిక్కుముడులు నెలకొన్నాయి. ఆరో దఫా చర్చల్లో ఈ చిక్కుముడులు వీడే అవకాశం ఉందని అందరూ భావించారు. ఈ క్రమంలో యూఎస్ ప్రతినిధుల పర్యటన రద్దు కావడం గమనార్హం. ఇక, సుంకాల నేపథ్యంలో ప్రధాని మోదీ (%ూవీ వీశీసఱ%) స్వదేశీ ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇవ్వాలంటూ దేశ ప్రజలకు సూచనలు చేశారు. రైతుల ప్రయోజనాలపై ఎన్నటికీ రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే ఆయన మరోసారి అమెరికాలో పర్యటించేందుకు సిద్ధమయ్యారు. ట్రంప్‌తో కూడా ఆయన భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.



## కాల్చి చంపడంలో ఉక్రెయిన్ సైనికుడి ప్రపంచ రికార్డ్

**ఉక్రెయిన్ :** ఉక్రెయిన్ స్నైపర్ యూనిట్ సైనికుడు ఒకరు ప్రపంచ రికార్డు బద్దలు కొట్టినట్లు కీవ్‌పోస్ట్ పత్రిక ప్రకటించింది. 13,000 అడుగుల కంటే ఎక్కువ దూరంలో ఉన్న రష్యా సైనికులను కాల్చి చంపినట్లు పేర్కొంది. ఇంత దూరం నుంచి గురితప్పకుండా కాల్చడం ఓ ప్రపంచ రికార్డు. స్థానికంగా తయారు చేసిన ఎలిగేటర్ 14.5 ఎంఎం రైఫిల్‌ను వాడి పొక్రొవొస్క్ ప్రాంతంలో ఇద్దరు రష్యన్ సైనికులను నేల కూల్చినట్లు మీడియా పేర్కొంది. ఇందుకు కృత్రిమమేధ, డ్రోన్ సాయం తీసుకొన్నాడు. ఆగస్టు 14వ తేదీన ఈ ఘనత సాధించాడని మిలిటరీ జర్నలిస్టు యూరి బుట్సోవ్ వెల్లడించారు. పుతిన్-ట్రంప్ అలాస్కాలో భేటీ కావడానికి ఒక్క రోజు ముందు ఈ రికార్డు నెలకొల్పడం గమనార్హం. ఇటీవల కాలంలో పొక్రొవొస్క్ ప్రాంతంపై రష్యా దాడులు గణనీయంగా పెరిగాయి. ఈ పట్టణంలో దాదాపు 60,000 మంది ప్రజలు నివాసం ఉంటున్నారు. గతంలో అత్యధిక దూరంలో లక్ష్యాన్ని ఛేదించిన చేసిన రికార్డు కూడా 58 ఏళ్ల ఉక్రెయిన్ స్నైపర్ పేరిటే ఉంది. అతడు నాడు 12,400 అడుగుల దూరంలోని రష్యా సైనికుడిని హతమార్చాడు.



## శ్రీ కృష్ణా జన్మాష్టమి వేడుకలు

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** శ్రీ కృష్ణా జన్మాష్టమి వేడుకల సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ గౌలిదొడ్డి గ్రామంలో ఎస్ ఆర్ ఫంక్షన్ హాలులో సేవా భారతి భాగ్యనగర్ సంస్థ వారి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు చిన్న పిల్లల ఆటపాటలతో ఘనంగా నిర్వహించినారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా బాసర ట్రిబుల్ ఐటీ రిటైర్డ్ వైస్ చైర్మన్. ప్రొఫెసర్ రాజ్ కుమార్, సేవా భారతి తెలంగాణ రాష్ట్ర సంఘటన మంత్రి వాసు ఊసుల మూర్తి, గోల్కొండ బాగ్ సంఘచలక్ కర్త కొండ శ్రీకాంత్ లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నాయకులు సంఘ సేవకులు చింతల్ రాజన్న, జెరిపెటీ ఈశ్వర్, బిక్షపతి, నర్సింగ్ రావు, ముద్దంగుల తిరుపతి, ముద్దంగుల గిరి, ఓం ప్రకాష్ , అరవింద్, దాత్రిక శ్రీనివాస్, డాక్టర్ నాగరాజు, మురళీధర్ రావు, హరి శంకర్ యాదవ్, విజయ రెడ్డి, గుంజ నాగేష్ , మంజుల హనుమంతు, వల్లపు గోవింద్, జరిపేటి నరసింహ తదితరులు పాల్గొన్నారు.



## ఎస్.ఎన్ రెడ్డి గార్డెన్ లో వివాహ వేడుకకు హాజరైన యలమంచి ఉదయ్ కిరణ్

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** ఆదివారం రోజున మియాపూర్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ, యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు యలమంచి ఉదయ్ కిరణ్, మియాపూర్ ఎం.ఎ.నగర్ కాలనీ వాసులు శ్రీకాంత్, రమ్య వివాహ వేడుకలో పాల్గొన్నారు. చందానగర్‌లోని ఎస్.ఎన్. రెడ్డి గార్డెన్ వేదికగా జరిగిన ఈ వేడుకలో మియాపూర్ ఎం.ఎ. నగర్ నివాసులు శ్రీకాంత్, రమ్య వివాహ వేడుక కి హాజరైన మియాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు యలమంచి ఉదయ్ కిరణ్, మియాపూర్ ఎం.ఎ . నగర్ నివాసులు శ్రీకాంత్, రమ్య వివాహ వేడుకలో పాల్గొని, కొత్త జీవితాన్ని ఆరంభించిన ఈ సందర్భంగా దంపతులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. చందానగర్‌లోని ఎస్.ఎన్. గార్డెన్ వేదికగా జరిగిన ఈ వేడుకలో ఎం.ఏ. నగర్ కాలనీ వాసులు కె. రాంబాబు, సురేష్, శ్రీకాంత్, ప్రవీణ్, రాజు రెడ్డి, వినోద్ చౌదరి, ప్రవీణ్, వంశీ, నాగసాయి, సింహాచలం, వినోద్, సీనియర్ జర్నలిస్ట్ బండి రామకృష్ణ గౌడ్ పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు అందజేశారు.



## పటేల్ గూడెంలో నూతన కుమ్మరి సంఘం గ్రామ కమిటీ ఎన్నిక

**ఆలేరు, రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం పటేల్ గూడెం గ్రామంలో జిల్లా కన్వీనర్ దరిపల్లి ప్రవీణ్ కుమార్, కో-కన్వీనర్ ఓరుగంటి గోపాల్ ఆదేశాల మేరకు, ఆదివారం ఉదయం 9 గంటలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన, తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో గ్రామ కమిటీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆలేరు మండల కన్వీనర్ గంగదారి సుధీర్ కుమార్, కో కన్వీనర్ కొరుటూరు ఉపేందర్, కో-కన్వీనర్ జీవిలికపల్లి సత్యనారాయణ హాజరయ్యారు. వారి సమక్షంలో నూతన గ్రామ శాఖ అధ్యక్షుడిగా తాడూరి గణేష్, ఉపాధ్యక్షుడిగా తాడూరి లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శిగా తాడూరి సంపత్ ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. ఈ సందర్భంగా ఆలేరు మండల కన్వీనర్ గంగదారి సుధీర్ కుమార్ మాట్లాడుతూ, మన కుమ్మరి సంఘం బలంగా ఎదగాలంటే, మనందరం ఒకటిగా నిలబడాలి. ఐక్యతే మన శక్తి. మన పూర్వీకులు మనకు అందించిన సంప్రదాయాలు, వృత్తులు కేవలం జీవనాధారమే కాదు, అవి మన గౌరవం, మన సాంస్కృతిక వారసత్వం. వాటిని కాపాడటం మన బాధ్యత. కొత్తగా ఏర్పడిన ఈ కమిటీ మన కులానికి దిశానిర్దేశం చేసే దీప స్తంభం కావాలి. ప్రతి ఒక్కరి సహకారం, కృషితో మన కుమ్మరి సంఘం భవిష్యత్తు మరింత వెలుగులు నింపాలని నేను ఆశిస్తున్నాను అని ఆయన ఉత్సాహపూర్వకంగా పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో గంగాధారి మహేందర్, విజ్జగిరి లక్ష్మీనారాయణ, గంగాధారి శ్రవణ్ కుమార్, గంగాదారి కిరణ్ కుమార్, తాడూరి భల భూచయ్య, తాడూరి బాల్ నర్సయ్య, తాడూరి రాములు, తాడూరి చంద్రశేఖర్, తాడూరి బాలరాజు, తాడూరి మధు, తాడూరి రాజశేఖర్, తాడూరి నాగరాజు, తాడూరి భానుచెందర్, నాగయ్యపల్లి ప్రసాద్, నాగయ్యపల్లి అరవింద్ తదితరులు పాల్గొని సంఘం ఐక్యతకు మద్దతు తెలిపారు. కుల బంధువులందరూ పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

**మొయినాబాద్ నేడు న్యూస్:** కుటుంబ కలహాలతో వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల..ప్రకారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్ నగర్ గ్రామానికి చెందిన కావలి వెంకటేష్ ముదిరాజ్ వయస్సు (48) వృత్తి డ్రైవర్, తనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొద్ది రోజుల క్రితం నగరంలోని ఓ ప్రైవేటు డ్రైవర్ గా జీవనం కొనసాగిస్తూ... భార్య పిల్లలు తన వద్దకు రావడం లేదనే మనస్థాపంతో వెంకటేష్ ముదిరాజ్ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం ఉదయం1:30 నిమిషాలకు తన ఇంట్లో అందరు నిద్రిస్తున్న సమయంలో పై అంతస్తులో వెళ్లి తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన సోదరుడు నిద్రిస్తున్న తన తమ్ముడు పక్కన లేకపోయేసరికి ఇంటి బయట ఆవరణలో చూడగా బిల్డింగ్ పై ఉరి వేసుకొని కనిపించాడు. చుట్టుపక్కల వారు వచ్చి పోలీసులకు సమాచారం అందించగా సమాచారం అందుకున్న పోలీసులు ఘటన ప్రదేశానికి చేరుకుని పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.



# ముత్తిరెడ్డిగూడెంలో ఘనంగా బీరప్ప బోనాలు

### బీరప్పకు బోనమెత్తిన కురుమ, గొల్లలు



**మోటకొండూరు, రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా, మోటకొండూరు మండలం, ముత్తిరెడ్డి గూడెం కురుమ, గొల్లల ఆరాధ్య దైవమైన శ్రీ శ్రీ శ్రీ బీరప్ప స్వామికి బోనాలు కురుమ, గొల్ల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ శ్రీ శ్రీ బీరప్ప స్వామి బోనాల వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా వందలాది మంది మహిళలు బోనమెత్తి ఊరేగింపు నిర్వహించారు. బోనాల ఊరేగింపులో డప్పు చప్పుళ్లు, ఒగ్గు కాళాకారుల డోలు వాయిద్యాల నడుమ శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, యువకుల కేరింతలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. శ్రావణ మాసంలో కురుమ, గొల్ల సంప్రదాయమైన పసరు పిల్లలను స్వామి వారికి సమర్పించారు. కురమ, గొల్ల కులస్తుల ఆరాధ్య దైవమైన బీరప్ప కామరాతి,అక్క మహంకాళి దేవులకు స్వామికి భక్తి శ్రద్ధలతో నైవేద్యాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బీరప్ప స్వామి అందరినీ చల్లగా చూడాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద కురుమ, బచ్చ విఠల్ కురుమ, సారి కురుమ, బచ్చ బిక్షపతి కురుమ, కురుమ సంఘం అధ్యక్షుడు కాటిక స్వామి యాదవ్, కుల సంఘం సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# పులిగిల్లలో ముత్యాలమ్మ,మైసమ్మకు ఘనంగా బోనాలు





**వలిగొండ, రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం లోని పులిగిల్ల గ్రామ రజక సంఘం ఆద్వర్యంలో ముత్యాలమ్మ, మైసమ్మ గ్రామ దేవతలకు ఆదివారము రోజున బోనాలు అంగరంగా వైభవంగా సమర్పించారు.ప్రతి ఏటా హిందూ కుల దైవాలకు బోనాలకు నైవేద్యం సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది. డబ్బు చప్పుల మధ్య శివసత్తుల పూనకాలతో ఘనంగా బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మహిళలు రంగురంగుల చీరలతో బోనం ఎత్తుకొని గ్రామ దేవతలకు సమర్పించడం ఎంతో ఆనందదాయకంగా ఉందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రజక సంఘ నాయకులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**పర్ల, రాజముద్ర న్యూస్ :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పర్ల, 1999 – 2000 బ్యాచ్ విద్యార్థులు, 25 సంవత్సరాలు పూర్తి అయినా సందర్భంగా 25 సంవత్సరాల సిల్వర్ జూబ్లీ కార్యక్ర మాన్ని సుమారుగా 60 మంది విద్యార్థులు ఆదివారం రోజున ఘనంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 1999 –2000 పాఠాలు నేర్పించిన గురు వులు హెడ్ మాస్టర్ చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యాయులు: కల్పన, ద్వారక శాస్త్రి, నగేష్, రమానాయుడు అందర్నీ పిలిచి సాలువలు, పూలదండలు, మొక్కలతో ఘనంగా సత్కరించారు. ఈ సంద ర్భంగా ఉపాధ్యాయు లు అందరూ విద్యార్థులు తీరును చూసి ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యా యులు మాట్లాడుతూ... మా విద్యార్థులు మా మీద గురు భక్తితో పిలువడం మాకు చాలా సంతోషాన్నిచ్చింది. మా విద్యార్థులు వాళ్ల వాళ్ల రంగాలలో అభివృద్ధి చెంది మరింత పైకి ఎదగాలని, మరిన్ని గొప్ప గొప్ప ఆశయాలని పూర్తి చేసుకోవాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు ఆటో పాటలతో సిల్వర్ జూబ్లీ కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకు న్నారు. విద్యార్థులు అందరూ 25 సంవత్సరాల తర్వాత కలుసుకో వడం ఎంతో సంతోషంగా ఉందని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పర్ల, పూర్వ ఉ పాధ్యాయులు, పూర్వ విద్యార్థులు కే. లక్ష్మన్న, యు. సుంకన్న, కే. శ్రీనివాసులు యు. లక్ష్మన్న, పురుషోత్తమ చారి, డి. శేఖర్, బి. కే. రాఘవేంద్ర, జలీల్ భాషా, శిరీష, దీప, నాగమణి, చౌడేశ్వరి, దస్తగిరి, బాల మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.





## గాజా పౌరులకు వీసాలు నిలిపివేసిన అమెరికా

**గాజా :** ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న గాజా ప్రజలపై మరో పిడుగు పడింది. ఇకపై గాజా ప్రజలకు వీసాలు నిలిపివేస్తున్నట్లు అమెరికా ప్రభుత్వం ప్రకటించింది. ఇజ్రాయెల్ దాడుల్లో గాయపడిన అనేకమంది ప్రజలు చికిత్స కోసం యూఎస్‌కు వస్తున్నారని ట్రంప్ యంత్రాంగానికి ఫిర్యాదు అందడంతో ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. తాత్కాలిక వైద్య–మానవతా వీసాలను జారీ చేయడానికి ఉపయోగించే ప్రక్రియపై సమీక్ష నిర్వహిస్తున్నామని ఇందులో భాగంగా గాజా ప్రజలకు అన్ని రకాల వీసాలు నిలిపివేస్తున్నామని అమెరికా విదేశాంగ శాఖ వెల్లడించింది. "గాజా నుంచి అమెరికాకు వచ్చే పాలస్తీనియన్లు హమాస్‌కు అనుకూలంగా ఉన్నారని.. హమాస్‌కు నిధులు సేకరించడానికి ప్రయత్నాలు చేస్తున్నారని ప్రభుత్వానికి ఫిర్యాదు అందడంతో ఈ చర్యలు తీసుకున్నాం" అని విదేశాంగ శాఖ తెలిపింది. గతవారం తీవ్రంగా గాయపడిన 11మంది పాలస్తీనియన్ చిన్నారులకు అమెరికాకు చెందిన స్వచ్ఛంద సంస్థ 'హీల్ పాలస్తీనా' వైద్య చికిత్స కోసం యూఎస్‌కు చేరుకోవడానికి సహకరించిందని పేర్కొంది. ఈ విధంగా పెద్ద మొత్తంలో ప్రజలను తరలించడం సరైనచర్య కాదని పేర్కొంది. ట్రంప్ యంత్రాంగం తీసుకున్న నిర్ణయంపై పలు స్వచ్ఛంద సంస్థలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. యూఎస్–ఆధారిత స్వచ్ఛంద సంస్థ 'పాలస్తీనా చిల్డ్రన్స్ రిలీఫ్ ఫండ్' ఈ విషయంపై స్పందిస్తూ..అమెరికా తీసుకున్న ఈ ప్రమాదకరమైన..అమానవీయ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసింది. గత 30 ఏళ్లుగా తాము వేలాదిమంది పాలస్తీనా చిన్నారులను వైద్యం కోసం అమెరికాకు తరలించినట్లు తెలిపింది. ఇజ్రాయెల్ దాడులు, ఆహార కొరత వల్ల వేలాదిమంది చిన్నారులు ప్రాణాలు కోల్పోతుంటే ఇలాంటి ఆంక్షలు ఎలా విధిస్తారని ప్రశ్నించింది.

## న్యూయార్క్‌లో కాల్పుల కలకలం.. ముగ్గురి మృతి

**న్యూయార్క్ :** అమెరికాలో కాల్పుల ఘటన కలకలం రేపింది. న్యూయార్క్ సిటీలోని రద్దీగా ఉన్న ఓ క్లబ్‌లో గుర్తుతెలియని వ్యక్తులు జరిపిన కాల్పుల్లో ముగ్గురు మృతి చెందారు. మరో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. న్యూయార్క్ సిటీలో తుపాకీ హింస రికార్డు స్థాయిలో తగ్గిపోయిన వేళ ఈ కాల్పులు చోటుచేసుకున్నాయి. స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం తెల్లవారుజామున 3:30 గంటల ప్రాంతంలో క్లబ్‌లో ఓ వివాదం చెలరేగిన అనంతరం పలు ఆయుధాలతో ఈ కాల్పులు జరిగినట్లు అనుమానిస్తున్నామని న్యూయార్క్ పోలీస్ కమిషనర్ జెస్సికా టిష్ వెల్లడించారు. ఘటనాస్థలం నుంచి 36 షెల్ కేసింగ్‌లను, సమీపంలోని వీధిలో ఓ తుపాకీని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మృతుల వయసు 27 నుంచి 61 ఏళ్ల మధ్యలో ఉంటుందని చెప్పారు. గాయపడినవారిలో ముగ్గురు మహిళలు ఉన్నారని, వారంతా ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ఈ ఏడాది మొదటి ఏడు నెలల్లో న్యూయార్క్ సిటీలో తుపాకీ హింస రికార్డు స్థాయికి తగ్గిందని.. కాల్పుల ఘటనలు, మృతుల సంఖ్య అత్యల్పంగా ఉందని జెస్సికా టిష్ వెల్లడించారు. తాజా కాల్పుల ఘటనను భయానకంగా పేర్కొన్న ఆమె.. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టి నిందితులను గుర్తిస్తామని తెలిపారు.

## కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



**మొయినాబాద్ :** కుటుంబ కలహాలతో వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల..ప్రకారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్ నగర్ గ్రామానికి చెందిన కావలి వెంకటేష్ ముదిరాజ్ వయస్సు (48) వృత్తి డ్రైవర్, తనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొద్ది రోజుల క్రితం నగరంలోని ఓ ప్రైవేటు డ్రైవర్ గా జీవనం కొనసాగిస్తూ... భార్య పిల్లలు తన వద్దకు రావడం లేదనే మనస్థాపంతో వెంకటేష్ ముదిరాజ్ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం ఉదయం1:30 నిమిషాలకు తన ఇంట్లో అందరు నిద్రిస్తున్న సమయంలో పై అంతస్తులో వెళ్లి తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన సోదరుడు నిద్రిస్తున్న తన తమ్ముడు పక్కన లేకపోయేసరికి ఇంటి బయట ఆవరణలో చూడగా బిల్డింగ్ పై ఉరి వేసుకొని కనిపించాడు. చుట్టుపక్కల వారు వచ్చి పోలీసులకు సమాచారం అందించగా సమాచారం అందుకున్న పోలీసులు ఘటన ప్రదేశానికి చేరుకుని పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.



## ప్రశాంతత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలి

**ఇన్స్పెక్టర్ పవన్ కుమార్ రెడ్డి**

**మొయినాబాద్ :** ప్రశాంతత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలని సర్కిల్ ఇన్స్పెక్టర్ పవన్ కుమార్ రెడ్డి తెలిపారు. వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మొయినాబాద్ మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న గణేష్ నవరాత్రుల నిర్వాహకులతో పోలీసులు సమావేశం నిర్వహించారు. సీఐ పవన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ. .. తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని ప్రశాంతత వాతావరణంలో ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు. సాంప్రదాయ బద్ధంగా ఉత్సవాలను నిర్వహించుకోవాలని మండపాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ప్రతి ఒక్కరు కలిసి మెలిసి ఐక్యమత్యంగా ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు. ఎలాంటి ఆలోచనయ ఘటనలు లేకుండా ఉత్సవాలనే నిర్వహించాలని ఆయన అన్నారు.

# పార్టీలపై ఈసీ ఎలాంటి వివక్ష చూపదు : సీఈసీ

**ఢిల్లీ:** ఎన్నికల సంఘానికి ఎలాంటి భేదభావాలు ఉండవని, అన్ని పార్టీలను సమానంగా చూస్తామని కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పేర్కొన్నారు. ఓటు చోరీ పేరుతో కొందరు అనవసర అనుమానాలు లేవనెత్తుతున్నారని ఆక్షేపించారు. బిహార్‌లో ఓటరు జాబితా సమగ్ర సవరణపై ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో మీడియా సమావేశం నిర్వహించిన సీఈసీ.. రాజ్యాంగ సంస్థలను అవమానించడం సరికాదన్నారు. ఓటరు జాబితాను బూత్ లెవల్‌లోనే ప్రతి పార్టీ చూసుకుంటుందన్నారు. సంస్కరణల్లో భాగంగానే ఓటరు జాబితాను సవరిస్తున్నట్లు స్పష్టం చేశారు. "బిహార్‌లో ఎస్ఐఆర్ పై కొన్ని పార్టీలు, సంబంధిత నేతలు అసత్య ప్రచారం చేయడం తీవ్ర ఆందోళనకరం. ఎన్నికల సంఘం భుజాల పైనుంచి కొన్ని రాజకీయ పార్టీలు దాడులు చేస్తున్నాయి. బిహార్ ఓటరు ముసాయిదా జాబితాలపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని అన్ని రాజకీయ పార్టీలకు సూచిస్తున్నాం. బూత్ స్థాయి అధికారులు, ఏజెంట్లు పారదర్శకంగా ఈ ప్రక్రియలో నిమగ్నమయ్యారు" అని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ పేర్కొన్నారు. "డబుల్ ఓటింగ్, ఓటు చోరీ ఆరోపణలకు ఎన్నికల సంఘం కానీ, ఓటరు భయపడే ప్రసక్తే లేదు. కోటి మందికిపై ఉద్యోగులు ఎన్నికల విధుల్లో నిమగ్నమయ్యారు. ఇంత పారదర్శకంగా చేపట్టిన కార్యక్రమంలో 'ఓటు చోరీ' ఎలా సాధ్యమవుతుంది..? ఆధారాలు లేకుండా జాబితా నుంచి ఓటరు పేరు తొలగించం. ప్రతిఒక్క ఒటరుకు ఈసీ దన్నుగా నిలుస్తుంది." అని సీఈసీ స్పష్టం చేశారు.

### ఇప్పటికి 10కిపైగా ఎస్ఐఆర్‌లు..

"సవరణ ప్రక్రియ హడావుడిగా చేస్తున్నామన్నది అవాస్తవం. ప్రతి ఎన్నికల ముందు ఓటరు జాబితాను సరిచేయడం ఎన్నికల సంఘం విధి. ఓటరు జాబితాలను సవరించేందుకు దేశంలో ఇప్పటివరకు 10 సార్లకుపైగా సవరణలను చేపట్టాం. పశ్చిమ బెంగాల్‌తోపాటు ఇతర రాష్ట్రాల్లో ఎస్ఐఆర్‌ను నిర్ణీత సమయంలో ప్రకటిస్తాం. ఓటరు జాబితాలో అభ్యంతరాలు ఉంటే సెప్టెంబర్ 1లోగా తెలియజేయాలని గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలను అభ్యర్థిస్తున్నా" అని ఎన్నికల ప్రధాన కమిషనర్ వెల్లడించారు.

### ఈసీ వ్యాఖ్యలు హాస్యాస్పదం: కాంగ్రెస్

తమకు అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీలనే తేడా ఉండదని ఎన్నికల సంఘం చెప్పడాన్ని కాంగ్రెస్ హాస్యాస్పదంగా పేర్కొంది. రాహుల్ గాంధీ లేవనెత్తిన ఏ ప్రశ్నకూ సీఈసీ అర్థవంతంగా సమాధానం ఇవ్వలేకపోయారని విమర్శించింది. ఈసీ సొంత డేటా ద్వారా వెల్లడైన వాస్తవాలను మాత్రమే రాహుల్ ప్రస్తావించారని గుర్తుచేసింది. బిహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై సుప్రీంకోర్టు ఇటీవల జారీ చేసిన ఆదేశాలను ఈసీ అక్షరాలా అమలు చేస్తుందా? అని పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు. ఈసీ వైఖరి దాని అసమర్థతను మాత్రమే కాకుండా, పక్షపాతాన్ని కూడా పూర్తిగా తేటతెల్లం చేసిందని ఆరోపించారు.




# వర్షాకాలం.. విద్యుత్‌తో పైలం

- ప్రకృతి వైపరీత్యాలు, పొంచి ఉన్న విద్యుత్ ప్రమాదాలు
- వ్యవసాయ పనుల్లో జాగ్రత్తలు తప్పనిసరంటున్న అధికారులు
- అప్రమత్తతే రక్ష

**వానాకాలం వచ్చిందంటే విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయి. కరెంటు విషయంలో అదమరిస్తే ప్రమాదాలు కొనితెచ్చుకున్నట్టే. వ్యవసాయదారులు విద్యుత్ బోరుబావులు, కాలువల వద్ద మోటర్లు ఏర్పాటు చేసి పంట సాగు చేస్తున్నారు. ఈ సమయంలో మోటార్ల వినియోగంలో రైతులు జాగ్రత్తలు పాటిస్తే ప్రమాద బారిన పడకుండా ఉండవచ్చు. ప్రైవేట్ వ్యక్తుల సహాయంతో వ్యవసాయ ట్రాన్స్ ఫార్మర్ల వద్ద ఫీజ్‌లు లైన్ మార్పిడి వంటి మరమ్మతులను చేయకూడదని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి సమయంలోనే ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉన్నాయి.**



### విద్యుత్ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు :

- తమ పంట పొలాల వద్ద విద్యుత్ తీగలు కిందకు వాలి ఉన్నా.. లూజ్ గా ఉన్న వెంటనే విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం అందించాలి



- పొలాల వద్ద ఉన్న ట్రాన్స్ఫార్మర్ ఏబి స్విచ్ పూర్తిగా నిలిచిపోకపోతే విద్యుత్ సరఫరా అయ్యే ప్రమాదం ఉంది. ట్రాన్స్ఫార్మర్ మరమ్మతులు చేయవలసి వస్తే తప్పనిసరిగా విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించి వారితోనే మరమ్మతులు చేయించుకోవాలి. ట్రాన్స్ ఫార్మర్ చుట్టూ పిచ్చి మొక్కలు లేకుండా చూసుకోవాలి.
- విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా పాత భవంతులు, రేకుల షెడ్లలలో నివసించేవారు. ఇంట్లో విద్యుత్ తీగలతో జాగ్రత్త వహించాలి.
- విద్యుత్ మోటర్ల వద్ద విద్యుత్ సరఫరా లోపం ఉంటే ఎలక్ట్రిషియన్ తో సరి చేయించుకోవాలి. విద్యుత్ పై పరిజ్ఞానం లేకుండా సొంతంగా మోటార్లను ముట్టుకోవద్దు.
- విద్యుత్ స్తంభం నుంచి మోటారుకు కరెంటు నేరుగా సరఫరా కాకుండా మధ్యలో ఫీజు బాక్స్ స్టార్టర్ తప్పనిసరిగా ఉండాలి.
- విద్యుత్ సరఫరాలో లో– ఓల్టేజ్ దృష్టిలో ఉంచుకొని సరైన ఫీజు వేయాలి. మోటార్ వద్ద ఫీజులు ఇండికేటర్ బల్బులు స్టార్టర్ ను ఒక చెక్కపై బిగించుకోవాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇనుప డబ్బాలపై బిగించకూడదు.
- మోటార్ పనిచేయని సమయాల్లో చేతితో దాన్ని తాకకూడదు. టెస్టర్ను ఉపయోగించి మాత్రమే పరీక్షించాలి
- విద్యుత్ స్తంభాల నుంచి వ్యవసాయ మోటారుకు మధ్య ఎక్కువ దూరం ఉండకుండా చూసుకోవాలి. ఎక్కువ దూరం ఉంటే గాలులు వచ్చినప్పుడు వాటి మధ్య ఉండే సర్వీస్ వైరు వదులై మోటర్ మీద ప్రభావం చూపుతుంది.
- రైతులు ఉపయోగించే విద్యుత్ ఉపకరణాలను విద్యుత్ శాఖ నిబంధనల మేరకు వినియోగించుకోవాలి. తాత్కాలిక కనెక్షన్లతో మోటర్లు నడపకూడదు.

### చేయకూడని పనులు..:

- వర్షం పడుతుంటే విద్యుత్ స్తంభాలను తాకొద్దు
- నీటిలో పడిన విద్యుత్ వైర్ల జోలికి వెళ్లొద్దు
- తడిచేతులతో, తడి బట్టలతో విద్యుత్ పరికరాలను ముట్టుకోవద్దు
- స్విచ్ బోర్డులు పిల్లలకు అందనంత ఎత్తులో ఉంచాలి
- స్తంభం, ట్రాన్స్ఫార్మర్, ఎర్త్ వైర్ల వద్ద మూత్ర విసర్జన చేయొద్దు
- భవన నిర్మాణ పనులు చేసేటప్పుడు విద్యుత్ వైర్లకు దూరంగా ఉండాలి
- కరెంటు సరఫరా లేదని.. నేరుగా విద్యుత్ మరమ్మతులు చేయరాదు

### ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోతే ఎక్స్ గ్రేషియా :

విద్యుత్ ప్రమాదాల వల్ల మరణిస్తే మనుషులకు రూ.5 లక్షలు, మూగజీవాలకు రూ.7 వేల నుంచి రూ.40 వేల వరకు ఎక్స్ గ్రేషియా అందజేస్తారు. దీని కోసం మృతుడి మరణ ధ్రువీకరణ పత్రం, ఎఫ్ఐఆర్ కాపీ, పోస్టుమార్టం రిపోర్ట్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్ తో సంబంధిత సెక్షన్ ఏఈకి, సంబంధిత విద్యుత్ అధికారికి దరఖాస్తు చేసుకోవాలి. ఈ దరఖాస్తులపై డీఈ (డివిజనల్ ఇంజినీర్) ఆధ్వర్యంలో ప్రాథమిక విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తారు.

### జాగ్రత్తలు తప్పకుండా పాటించాలి

**విజయ్ కుమార్, మేడ్చల్ విద్యుత్ శాఖ ఏఈ**



పంట పొలాల్లో విద్యుత్ సమస్యలు వస్తే సంబంధిత ఏఈ కానీ, లైన్మెన్ కు కానీ సమాచారం ఇచ్చి మరమ్మతులు చేయించుకోవాలి. ప్రైవేట్ ఎలక్ట్రిషన్లను ఆశ్రయించి ప్రమాదాలను కోరి తెచ్చుకోవద్దు. మీ ప్రాంతాల్లోని విద్యుత్ శాఖ అధికారు లు, సిబ్బంది స్పందించకపోతే మీ సమీపంలోని విద్యుత్ శాఖ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయాలి. ప్రమాదా ల నివారణకై విద్యుత్ శాఖ భద్రతాపరమైన సలహాలు, సూచనలు తప్పక పాటించాలి. వర్షం ఉరుములు మెరుపులు వస్తున్నప్పుడు టీవీ, ఫ్రిజ్, కంప్యూటర్స్, ఏసీ స్విచ్లు ఆఫ్ చేయాలి. లేకుంటే వైర్లు షార్ట్ సర్క్యూట్ అయ్యే అవకాశం ఉంది. ప్రతి ఒక్కరూ విద్యుత్ పట్ల జాగ్రత్త వహించాలి

# నింగికెగిసిన కమ్యూనిస్టు యోధుడు



- **అక్తర్ పాషా మరణం సీపీఐ కి తీరని లోటు**
- **సిపిఐ జిల్లా కార్యదర్శి వై. దామోదర్ రెడ్డి**
- **నివాళులర్పించిన మాజీ జెడ్పిటిసి మందాడి రామకృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు**

**గుండాల :** బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం పనిచేసిన అక్తర్ పాషా మరణం సీపీఐ పార్టీకి తీరనిలోటు అని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వై. దామోదర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మరిపడిగ గ్రామానికి చెందిన మహమ్మద్ అక్తర్ పాషా అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. తెలంగాణ సాయుధ పోరాటం నుండి నేటి వరకు అక్తర్ పాషా కుటుంబం సిపిఐ పార్టీలోనే కొనసాగుతుంది. ఆయన మరణ వార్త మరిపడిగ గ్రామంలో విషాదాన్ని నింపింది. ఈ సందర్భంగా మండల పరిధిలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు అక్తర్ పాషా పార్థివ దేహం పై పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి దామోదర్ రెడ్డి మాట్లాడుతూ.. అక్తర్ పాషా సేవలను కొనియాడారు. అక్తర్ పాషా కుటుంబం సిపిఐ జెండా కింద పనిచేస్తూ నాలుగు దశాబ్దాలుగా బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం పని చేసిందన్నారు. వారి కుటుంబానికి సిపిఐ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. నివాళులర్పించిన వారిలో గుండాల మండల మాజీ జెడ్పిటిసి మందాడి రామకృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెల్లెంకి సోమ నర్సింహారెడ్డి, దుంపల శ్రీనివాస్, వెల్లెంకి జయపాల్ రెడ్డి, గూడెపు కుమార్, బీఆర్ఎస్ నాయకులు తాండ్ర శోభన్, సిపిఐ జిల్లా మాజీ కార్యదర్శి గోదా శ్రీరాములు, జిల్లా సహాయ కార్యదర్శి చంద్రన్న, రాష్ట్ర సమితి సభ్యులు ఆది సాయన్న, జిల్లా కార్యవర్గ సభ్యులు కే. హరిచంద్ర, సీనియర్ నాయకులు దయాకర్ రెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి అనంతుల రామచంద్రయ్య, మండల కార్యవర్గ సభ్యులు బక్కయ్య, జి. వెంకన్న, స్వామి, చంద్రయ్య, జి.రామచంద్రు, యాదయ్య, బిక్షం తదితరులు పాల్గొన్నారు.



## బండ కొత్తపల్లి బోనాలలో అపశృతి

**ఒకరు మృతి మరొక్కరికి తీవ్ర గాయాలు**

**గుండాల :** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం బండకొత్తపల్లి గ్రామంలో ముత్యాలమ్మ తల్లి అమ్మవారి బోనాల జాతర మహోత్సవ కార్యక్రమంలో మద్యం మత్తులో సంగు శ్రీను అనే ట్రాక్టర్ డ్రైవర్ అతివేగంగా ట్రాక్టర్ నడపడంతో అదుపుతప్పి పక్కనే ఉన్న నిరుపేద కుటుంబానికి చెందిన రామగిరి శ్రీరాములు పై దూసుకు వెళ్లడంతో శ్రీరాములు అక్కడికక్కడే మృతి చెందాడు మరో వ్యక్తికి నిమ్మనగోటి లింగయ్యకు గాయాలు అంబులెన్స్ లో జనగామ ఏరియా హాస్పిటల్ కు తరలించారు.



# మీ బండికి ఇన్సూరెన్స్ ఉందా?

రోడ్డుపై వాహనం తిరగాలంటే కచ్చితంగా బీమా ఉండాల్సిందే. కానీ, ఇటీవలి నివేదికల ప్రకారం చూస్తే..అధిక శాతం వాహనాలకు ముఖ్యంగా ద్విచక్ర వాహనాలకు బీమా పాలసీ ఉండటమే లేదు. బీమా లేకుండా రోడ్డుపైకి వచ్చే వాహనాలకు జరిమానా విధించాలని ప్రభుత్వాలు ఆలోచిస్తున్నాయి. ఇప్పటికే ఇది అమలవుతున్నా, కాస్త కఠినంగా వ్యవహరించాలని అనుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో మీ బండికి బీమా ఉందా లేదా ఒకసారి పరిశీలించండి.

## వైవిధ్యంగా పెట్టుబడులు

ఈక్విటీలు, బంగారం, డెట్ పథకాల్లో మదుపు చేయాలని భావించే వారిని లక్ష్యంగా చేసుకొని, ఎడిల్‌వైజ్ మ్యూచువల్ ఫండ్ సరికొత్త ఫండ్‌ను తీసుకొచ్చింది. ఎడిల్‌వైజ్ మల్టీ అసెట్ ఓమ్ని ఫండ్ ఆఫ్ ఫండ్ అనే ఈ పథకం ఎన్ఎఫ్ఓ ఈ నెల 26 వరకూ అందుబాటులో ఉంటుంది. కనీస పెట్టుబడి రూ.100. ఈక్విటీ, డెట్, గోల్డ్, సిల్వర్ ఈటీఎఫ్‌లలో వైవిధ్యంగా మదుపు చేయడం ద్వారా పెట్టుబడిదారులకు బహుళ పెట్టుబడి అవకాశాలను కల్పిస్తుంది. మార్కెట్ పరిస్థితులను బట్టి, ఆయా విభాగాల్లో పెట్టుబడి నిష్పత్తిని మారుస్తూ ఉంటుంది. ఈ విధానం వల్ల ఒకే విభాగంపై ఆధారపడకుండా చూసుకుంటుంది. నష్టభయం భరించగలిగి, 5-7 ఏళ్లపాటు కొనసాగే దీర్ఘకాలిక మదుపరులకు ఇది అనుకూలం. మల్టీ అసెట్ వ్యూహంతో ఒకే ఫండ్‌లో వివిధ విభాగాల్లో మదుపు చేయాలనుకునే వారూ పరిశీలించవచ్చు.

## అధిక రాబడి ఆర్జించేలా




డీఎస్‌పీ మ్యూచువల్ ఫండ్ ఒక వినూత్న పథకాన్ని తీసుకొచ్చింది. డీఎస్‌పీ నిఫ్టీ 500 ఫ్లెక్సీక్యాప్ క్వాలిటీ 30 ఇండెక్స్ ఫండ్ పేరుతో వచ్చిన ఈ పథకం ఎన్ఎఫ్ఓ ఈ నెల 22 వరకూ అందుబాటులో ఉంటుంది. కనీస పెట్టుబడి రూ.100. నిఫ్టీ 500 ఫ్లెక్సీ క్యాప్ క్వాలిటీ 30 ఇండెక్స్‌ను ప్రామాణికంగా తీసుకుంటుంది. అధిక రిటర్న్ ఆన్ ఈక్విటీ (ఆర్ఓఈ), తక్కువ అప్పులు, స్థిరమైన ఆదాయ వృద్ధి వంటి నాణ్యతా ప్రమాణాల ఆధారంగా కంపెనీలను ఎంపిక చేస్తుంది. మార్కెట్ పరిస్థితులను బట్టి, లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్ స్టాక్‌లలో పెట్టుబడి నిష్పత్తిని మార్చుకుంటూ వెళ్తుంది. తొలిసారిగా ఫ్లెక్సీక్యాప్, క్వాలిటీ రెండింటినీ కలిపిన వ్యూహంతో వచ్చింది. దీర్ఘకాలిక లక్ష్యాలు, నష్టభయం భరించగలిగే వారికి అనుకూలం. ప్రత్యేక వ్యూహంతో నష్టభయాన్ని పరిమితం చేస్తూ, అనేక రకాల వ్యూహాలతో పనిచేస్తున్న ఈటీఎఫ్‌లలో మదుపు చేసే వ్యూహంతో మిరే అసెట్ మ్యూచువల్ ఫండ్ ఒక కొత్త పథకాన్ని తీసుకొచ్చింది. మిరే అసెట్ మల్టీ ఫ్యాక్టర్ పాసివ్ ఫండ్ ఆఫ్ ఫండ్ అనే ఈ పథకం ఎన్ఎఫ్ఓ ఈ నెల 25 వరకూ కొనసాగుతుంది. కనీస పెట్టుబడి రూ.5,000. వాల్యూ, గ్రోత్, క్వాలిటీ, మొమెంటమ్‌లాంటి వాటి ఆధారంగా పనిచేసే ఈటీఎఫ్‌లను ఎంచుకొని, వాటిలో మదుపు చేస్తుంది.



### సున్నా తరుగుదల:


ద్విచక్ర వాహన బీమా పాలసీలో ముఖ్యమైన రైడర్లలో ఇదొకటి. ప్రమాదంలో దెబ్బతిన్న భాగాల విలువకు సమానమైన మొత్తాన్ని అందుకుంటారు. ఈ యాడ్-ఆన్ లేకపోతే ప్రతి భాగంపై తరుగుదల లెక్కించి, ఆ మేరకే బీమా సంస్థ చెల్లిస్తుంది. మిగతా మొత్తాన్ని చేతి నుంచి భరించాల్సి వస్తుంది.

**ఇంజిన్‌కు రక్షణ:** ఇంజిన్ అంతర్గత భాగాలు దెబ్బతిన్నప్పుడు ఇది ఉపయోగప డుతుంది. వరదల్లో వాహనం చిక్కుకున్నప్పుడు ఇంజిన్ పాడయ్యే అవకాశం ఉంటుంది. ఇలాంటప్పుడు ఈ అనుబంధ పాలసీ ఉపయోగపడుతుంది. టైర్లకు నష్టం వాటిల్లినప్పుడు టైర్ ప్రొటెక్టర్ పాలసీ సైతం అందుబాటులో ఉంటుంది.

### వాహనం ఆగితే సాయం:

ప్రమాదం లేదా వాహనం చెడిపోవడంలాంటి సందర్భాల్లో వాహనం రోడ్డుపైనే ఆగిపోతుంది. ఇలాంటప్పుడు సాయం చేసేందుకు రోడ్ సైడ్ అసిస్టెన్స్ రైడర్ ఉపయోగపడుతుంది. వాహనం పాడైన సందర్భంలో నట్లు, బోల్టులు, ఇంజిన్ ఆయిల్ లాంటి వాటికోసం చేసిన ఖర్చులనూ తిరిగి పొందేందుకు కన్జ్యూమబుల్ యాడ్-ఆన్ పాలసీ తీసుకోవచ్చు. మనం ఎంత సురక్షితంగా వాహనాన్ని నడిపినా.. అనుకోకుండా ప్రమాదాల బారిన పడే సందర్భాలుంటాయి. ఇలాంటి వాటికి ఆర్థికంగా సన్నద్ధం కావడం ముఖ్యం. అదే సమయంలో చట్టపరమైన బాధ్యతనూ నెరవేర్చడంలోనూ బీమా పాలసీ తోడ్పడుతుంది. కాబట్టి, మీ వాహనానికి ఎప్పుడూ సమగ్ర వాహన బీమా పాలసీ ఉండేలా చూసుకోండి. రోడ్డు మీద ధీమాగా ఉండండి.

మోటారు వాహనాల వినియోగం గణనీయంగా పెరిగింది. ప్రమాదాలూ అదే స్థాయిలో నమోదవుతున్నాయి. ఈ సందర్భాల్లో బండి దెబ్బతినడం, వాహనాదారుడికి గాయాలు కావడం, కొన్నిసార్లు మరణాలూ సంభవిస్తుంటాయి. ప్రయాణంలో జాగ్రత్తలు పాటించడం తప్పనిసరి. దీంతోపాటు అనుకోని ప్రమాదంలో ఆర్థిక భారం లేకుండా ఉండేందుకు మోటార్ వాహన బీమా కూడా ఉండాలి. భారతీయ మోటారు వాహన చట్టం ప్రకారం రోడ్డుపై తిరిగే ప్రతి వాహనానికి కనీసం థర్డ్ పార్టీ బీమా తప్పనిసరి. ఇది లేకుండా వాహనాన్ని బహిరంగ ప్రదేశాల్లో ఉపయోగించడం నేరం. లైసెన్సు, వాహన రిజిస్ట్రేషన్, బీమా, ఇతర అవసరమైన పత్రాలు లేకుండా వాహనం తీయకూడదు. వాహనం ద్వారా మూడో పక్షానికి (థర్డ్ పార్టీ.. వాహనం, వాహనాన్ని నడిపే వ్యక్తి కాకుండా ఇతరులు) ఏదైనా నష్టం వాటిల్లినప్పుడు పరిహారం ఇచ్చేది థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్. దీన్ని లయబిలిటీ ఓన్లీ పాలసీగానూ పిలుస్తారు. విస్తృత బీమా ప్రయోజనాన్ని కల్పించేది సమగ్ర ద్విచక్ర వాహన బీమా. ప్రమాదం, దొంగతనం, వరదలు, అగ్నిప్రమాదం, ప్రకృతి వైపరీత్యాలు, తదితర వాటి వల్ల నష్టానికి పరిహారం ఇవ్వడంతోపాటు, థర్డ్ పార్టీకి వాటిల్లిన నష్టాన్నీ ఇది భర్తీ చేస్తుంది. సమగ్ర బీమా పాలసీకి కొన్ని అనుబంధ పాలసీలనూ జోడించుకునే అవకాశం ఉంది. వీటిని రైడర్లుగా పిలుస్తారు.



# నకిలీ ఏజెంట్లతో జాగ్రత్త..

## బీమా సంస్థల హెచ్చరిక

ఆర్థిక సంవత్సరం ముగింపు దగ్గరకు వస్తుండటంతో పలు పెట్టుబడి పథకాల్లో మదుపు చేసే వారి సంఖ్య అధికంగా ఉంటుంది. ఈ నేపథ్యంలోనే బీమా పాలసీలు తీసుకోవాల్సిందిగా చెబుతూ నకిలీ ఏజెంట్లూ పుట్టుకొస్తున్నారు. వీరి విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని బీమా సంస్థలు హెచ్చరిస్తున్నాయి. వీరిని గుర్తించేందుకు కొన్ని సూచనలూ చేస్తున్నాయి.

- తక్కువ ప్రీమియం చెల్లించినా చాలు.. భవిష్యత్తులో మంచి లాభాలు వస్తాయని చెబుతూ పాలసీలను అంటగట్టాలని చూస్తుంటారు. ప్రత్యేక రాయితీలు, మంచి లాభాలు అంటూ ఆకర్షించే మాటలు చెబుతుంటారు. ఇది మోసం చేసే ప్రయత్నమే. బీమా కంపెనీలు ఎప్పుడూ అధిక రాబడికి హామీ ఇవ్వవు అనేది గుర్తుంచుకోవాలి.
- బీమా పాలసీలు తీసుకున్నప్పుడు ప్రీమియం మొత్తాన్ని కచ్చితంగా ఆన్‌లైన్ వేదికల ద్వారా లేదా చెక్కు రూపంలోనే చెల్లించాల్సి ఉంటుంది. అదీ సంబంధిత కంపెనీ పేరుమీదే. ఇలా కాకుండా నగదుగా ఇవ్వాలని, వ్యక్తిగత ఖాతాలోకి డబ్బు పంపాలని అంటున్నారంటే అది కచ్చితంగా మోసమే. కంపెనీ అధీకృత ఖాతాలోనే ఎప్పుడూ ప్రీమియం జమ చేయాలి.
- ఇప్పుడున్న డిజిటల్ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక సామాజిక వేదికపై తమ గుర్తింపును తెలియజేయాలని, తద్వారా తమ వ్యాపారాన్ని పెంచుకోవాలని చూస్తుంటారు. ఇలాంటివి ఏమీ లేకుండా ఉన్నారంటే ఆ ఏజెంట్లను అనుమానించాల్సిందే.
- ఈ రోజే ఈ పాలసీ ముగుస్తుంది.. ఇప్పుడు చెల్లిస్తేనే ఈ ప్రీమియం వర్తిస్తుంది.. లేకపోతే




అవకాశం కోల్పోతారు.. ఇలాంటి మాటలు నకిలీ ఏజెంట్లే చెబుతారు. బీమా పాలసీ తీసుకునేందుకు నిర్ణీత గడువు అంటూ ఏమీ ఉండదు. ఏవో కొన్ని పాలసీలకే ఇది వర్తిస్తుంది. బీమా సంస్థ, పాలసీ పేరు, ఇతర వివరాలను తెలుసుకోకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రీమియం చెల్లించకూడదు.
- బీమా సంస్థ వెబ్‌సైట్, సహాయ కేంద్రంలో పాలసీలకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకోండి. తర్వాతే పాలసీ తీసుకోండి.

# రోహిత్‌ను ఉదయాన్నే 10కి.మీ పరిగెత్తమనండి


## మాజీ క్రికెటర్ యోగ్‌రాజ్ సింగ్




టెస్టులు, టీ20లకు వీడ్కోలు పలికిన రోహిత్ శర్మ కేవలం వన్డేల్లోనే ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. వచ్చే వన్డే ప్రపంచ కప్ (2027) వరకూ కొనసాగాలనేదే అతడి ఆకాంక్ష. కానీ, రోహిత్ ఫిట్‌నెస్ కీలకం కానుంది. ప్రస్తుతం అతడి వయసు 37 సంవత్సరాలు. ఇంకా రెండేళ్ల సమయం ఉన్న నేపథ్యంలో అప్పటి వరకూ ఫామ్‌తోపాటు ఫిట్‌గా ఉండాల్సిన అవసరం ఉంది. ఈ విషయంలో రోహిత్ శర్మకు మాజీ క్రికెటర్ యోగ్‌రాజ్ సింగ్ కీలక సూచనలు చేశాడు. కెరీర్‌ను కొనసాగించేందుకు చాలా అవకాశం ఉందని రోహిత్‌కు మద్దతుగా నిలిచాడు. "రోహిత్ శర్మ సత్తాపై ఎప్పుడూ అనుమానం అక్కర్లేదు. అతడి గురించి బయట మాట్లాడుకొనే మాటలన్నీ చెత్తే. అప్పుడైనా ఎప్పుడైనా సరే రోహిత్ నేను అభిమానించే మనిషి. అతడి బ్యాటింగ్ ఒకవైపు.. మిగతా జట్టు ఆటగాళ్ల బ్యాటింగ్ అంతా మరోవైపు. అతడి బ్యాటింగ్ చాలా క్లాస్. ఇలాంటప్పుడే మీరు (అభిమానులను ఉద్దేశించి) రోహిత్‌ను మరింత కాలం ఆడేలా కోరాలి. దేశం కోసం కొనసాగాలని చెప్పండి. ఫిట్‌నెస్‌పై దృష్టిపెట్టమని సూచించండి. ఉదయాన్నే 10 కి.మీలు పరిగెత్తమనండి. ఇలా చేస్తే 45 ఏళ్లు వచ్చేవరకూ క్రికెట్ ఆడేందుకు వీలవుతుంది" అని యోగ్‌రాజ్ వ్యాఖ్యానించాడు.

### అతడికి అవసరం లేదు..

దేశవాళీలో ఆడితేనే అవకాశం ఇస్తామని చెప్పడం రోహిత్ విషయంలో తగదని యోగ్‌రాజ్ తెలిపాడు. " రోహిత్ దేశవాళీలో ఆడతాడని నేను భావిస్తున్నా. అంతకముందే నువ్వు ఫిట్‌గా ఉండాల్సిన అవసరం ఉంది. అంతేకానీ, ఎవరో విమర్శలు చేస్తున్నారని ఆడక్కర్లేదు. వారికేం తెలుసని ఇలాంటి వ్యాఖ్యలు చేయడానికి. ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ఎవరు? రోహిత్ కాదా.. అతడి ఫిట్‌నెస్, ఆటపై వ్యాఖ్యలు చేసేందుకు కనీసం సిగ్గుపడాలి" అని యోగ్‌రాజ్ సింగ్ వ్యాఖ్యానించాడు. మాజీ స్టార్ ఆల్‌రౌండర్ యువరాజ్‌సింగ్ తండ్రిగా యోగ్‌రాజ్ అందరికీ సుపరిచితుడే.




# అర్జున్ తెండూల్కర్ ఆర్జన ఎంతంటే?

క్రికెట్ దిగ్గజం సచిన్ కుమారుడు అర్జున్ తెండూల్కర్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాడు. ఇటీవలే అతడికి నిశ్చితార్థం జరిగినట్లు వార్తలు వచ్చాయి. ప్రముఖ పారిశ్రామికవేత్త రవి ఘాయ్ మనుమరాలు సానియా చందోక్‌తో వివాహం జరగనున్నట్లు తెలుస్తోంది. అయితే, ఇప్పటి వరకు సచిన్ ఫ్యామిలీ నుంచి అధికారికంగా ప్రకటన వెలువడలేదు. ఈ క్రమంలో అర్జున్ ఆదాయంపై ఇప్పుడు ఫ్యాన్స్ నెట్టింట శోధిస్తున్నారు. ఐపీఎల్‌లో రూ.30 లక్షలకు ముంబయి ఇండియన్స్ తీసుకున్న సంగతి తెలిసిందే. గత సీజన్‌లో ఆడే అవకాశం కూడా రాలేదు. భారత క్రికెట్‌కు సచిన్ అందించిన సేవలు, యాడ్స్ ద్వారా ఆర్జించిన ఆదాయం గురించి అభిమానులకు ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. కానీ, అంతర్జాతీయ క్రికెట్‌లోకి ఇంకా అడుగుపెట్టని అర్జున్ సంపాదన ఎంత ఉంటుందనేది ఇప్పుడందరిలోనూ ఆసక్తి నెలకొంది.

### క్రికెట్ నుంచి..

ఈ పాతికేళ్ల అర్జున్ 2021లో ఐపీఎల్‌లోకి ఎంట్రీ ఇచ్చాడు. అప్పుడు ముంబయి ఇండియన్స్ రూ.20 లక్షలకు తీసుకుంది. మళ్లీ 2023 వేలంలో రూ.30 లక్షలకు తీసుకుంది. గత మెగావేలంలోనూ అంతే మొత్తంతో కొనుగోలు చేసింది. కేవలం ఐదు మ్యాచుల్లోనే ఆడే అవకాశం వచ్చింది. ఐపీఎల్ నుంచి ఇప్పటి వరకూ రూ.1.40 కోట్లు ఆర్జించినట్లు ఓ జాతీయ వెబ్‌సైట్ కథనంలో పేర్కొంది. మెగా లీగ్‌లోనే కాకుండా.. అతడు దేశవాళీ క్రికెట్‌లోనూ ఆడుతున్నాడు. గోవా తరఫున ఇటీవల బరిలోకి దిగాడు. రంజీ ట్రోఫీ, విజయ్ హాజరే ట్రోఫీ, సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీల్లోనూ ఆ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. ఇక్కడ ఆడటం వల్ల ఏడాదికి రూ. 10 లక్షలు సంపాదిస్తున్నట్లు కథనాలు పేర్కొన్నాయి. కుటుంబం నుంచి వచ్చిన ఆస్తులతో కలిసి అతడి సంపద విలువ రూ. 22 కోట్లుగా తెలుస్తోంది. ప్రస్తుతం అర్జున్ కుటుంబ సభ్యులతోనే కలిసి ఉంటున్నాడు.

### పేస్ ఆల్‌రౌండరే కానీ..

ఆరు అడుగుల రెండు అంగుళాల ఎత్తైన అర్జున్ తెండూల్కర్ తన తండ్రిలా కాకుండా పేస్ ఆల్‌రౌండర్ కావడం గమనార్హం. బ్యాటింగ్‌లో రికార్డులు సృష్టించిన సచిన్ బౌలింగ్‌లోనూ వికెట్లు తీశాడు. కానీ, అతడు స్పిన్ బౌలింగ్ వేసేవాడు. అర్జున్ మాత్రం పేసర్ కావడం గమనార్హం. ఇప్పటి వరకు అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగు పెట్టని అతడు దేశవాళీలో మాత్రం ఫర్వాలేదనిపించాడు. లెఫ్ట్‌ఆర్మ్ పేసర్ అయిన అర్జున్ 17 ఫస్ట్‌క్లాస్ మ్యాచులు ఆడాడు. మొత్తం 37 వికెట్లు తీశాడు. బ్యాటింగ్‌లోనూ 532 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీ, రెండు హాఫ్ సెంచరీలూ ఉన్నాయి. ఐపీఎల్‌లో 5 మ్యాచుల్లో మూడు వికెట్లు తీశాడు.




# ఆసియా కప్ బరిలోకి దిగే పాకిస్థాన్ స్క్వాడ్ ఇదే

మరికొద్ది రోజుల్లో మొదలు కానున్న ఆసియా కప్ 2025 టోర్నీ కోసం పాకిస్థాన్ క్రికెట్ బోర్డు 17 మందితో కూడిన స్క్వాడ్‌ను ప్రకటించింది. సీనియర్ క్రికెటర్లు మహ్మద్ రిజ్వాన్, బాబర్ అజామ్‌కు షాక్ ఇచ్చింది. ఆసియా కప్‌తోపాటు యూఏఈ వేదికగా జరగనున్న ట్రైసిరీస్‌కూ వారిని ఎంపిక చేయలేదు. మహ్మద్ రిజ్వాన్ వన్డే జట్టు సారథిగా ఉన్న సంగతి తెలిసిందే. సెప్టెంబర్ 9 నుంచి టీ20 ఫార్మాట్‌లో జరగనున్న ఆసియా కప్ టోర్నీకి యూఏఈ వేదిక. పాక్ తన తొలి మ్యాచ్‌లో ఒమన్‌తో తలపడాల్సి ఉంది. భారత్ – పాక్ ఒకే గ్రూప్‌లో ఉన్న సంగతి తెలిసిందే. ఇక యూఈఏ, అఫ్గానిస్థాన్‌తో ముక్కోణపు టీ20 సిరీస్‌లోనూ పాక్ బరిలోకి దిగనుంది. ఆగస్ట్ 29 నుంచి ఇది మొదలు కానుంది.

**పాక్ జట్టు:** సల్మాన్ అఘా (కెప్టెన్), అబ్రార్ అహ్మద్, ఫహీమ్ అష్రాఫ్, ఫకర్ జమాన్, హారిస్ రవూఫ్, హసన్ అలీ, హసన్ నవాజ్, హుస్సేన్ తలాత్, ఖుష్దిల్ షా, మహ్మద్ హారిస్ (వికెట్ కీపర్), మహ్మద్ నవాజ్, మహ్మద్ వాసిమ్ జూనియర్, షహిబ్‌జాద ఫర్హాన్, సయామ్ ఆయుబ్, సల్మాన్ మిర్జా, షహీన్ షా అఫ్రిది, సుఫ్‌యాన్ మోకిమ్

# వారి అనుమానాలు తీరాయి..

## ఇక క్రికెట్‌పైనే ఎక్కువ దృష్టిపెడతా : సీఎస్‌కే క్లారిటీపై అశ్విన్

దక్షిణాఫ్రికా ఆటగాడు డెవాల్డ్ బ్రెవిస్‌ను చెన్నై సూపర్ కింగ్స్ అధిక మొత్తం వెచ్చించి తీసుకుందని రవిచంద్రన్ అశ్విన్ చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. అందుకోసం ప్లేయర్‌కు చెందిన ఏజెన్సీలతో పెద్దఎత్తున సంప్రదింపులు జరిపినట్లు ఓ వీడియోలో వ్యాఖ్యానించాడు. దానిపై సీఎస్‌కే ప్రకటన జారీ చేసింది. ఆ వివరణపై తాజాగా అశ్విన్ మరోసారి స్పందించాడు. ఇంతకీ ఏమన్నాడు? సీఎస్‌కే ఏం వివరణ ఇచ్చింది? మళ్లీ భారత మాజీ ప్లేయర్ ఎలా స్పందించాడో చూద్దాం..

### తొలుత అశ్విన్ ఏమన్నాడంటే?

తన యూట్యూబ్ ఛానల్‌లో చాలా విషయాలపై అశ్విన్ డిబేట్లు పెడుతుంటాడు. ఇలాగే సీఎస్‌కే గత ఐపీఎల్ సమయంలో తీసుకున్న ఓ నిర్ణయంపైనా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. సౌతాఫ్రికా ఆటగాడు బ్రెవిస్ బేస్ ప్రైస్ రూ. 75 లక్షలు. కానీ, అతడిని రిప్లేస్‌మెంట్‌గా రూ.2.2 కోట్లు చెల్లించి చెన్నై తీసుకుంది. గుర్జప్‌నీత్ సింగ్ గాయం కారణంగా ఆ ఎడిషన్‌కు దూరమైన సంగతి తెలిసిందే. అతడి స్థానంలోనే బ్రెవిస్‌కు అవకాశం లభించింది. ఇతర జట్లు కూడా పోటీ పడినా.. అతడి ధర చూసి వెనక్కి తగ్గాయని, సీఎస్‌కే మాత్రం పట్టుబట్టి తీసుకుందని అశ్విన్ వ్యాఖ్యానించాడు. అతడు చేసిన వ్యాఖ్యలను బట్టి సీఎస్‌కే బ్రెవిస్‌ను అక్రమంగా తీసుకుందనే ఆరోపణలు వినిపించినట్లు క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ నుంచి అప్రూవల్ రాలేదనే విమర్శలూ వస్తున్నాయి. మరోవైపు రిప్లేస్‌మెంట్ ప్లేయర్‌కు గాయపడిన ఆటగాడి కంటే ఎక్కువ ఇవ్వడానికి వీల్లేదనే నిబంధనను సీఎస్‌కే పాటించిందని, అందులో తప్పేమీ లేదని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చకు దారితీసిన ఈ విషయంపై చెన్నై మేనేజ్‌మెంట్ స్పందించింది.



### అదంతా పద్ధతి ప్రకారమే..: సీఎస్‌కే

"బ్రెవిస్‌తో మేం ఒప్పందం చేసుకున్నాం. రిప్లేస్‌మెంట్ ఆటగాడిగా అతడిని తీసుకున్నాం. ఈ ప్రక్రియలో ఫ్రాంచైజీ తీసుకున్న అన్ని చర్యలు ఐపీఎల్ నియమనిబంధనలకు లోబడే జరిగాయి. ఇందులో ఎలాంటి అక్రమాలకు చోటులేదు. గాయపడిన ప్లేయర్ ఫీజు కంటే అతడి స్థానంలో వచ్చే క్రికెటర్‌కు ఎక్కువ చెల్లించకూడదనే నిబంధనను పాటించాం. గుర్జప్‌నీత్‌కు ఎంత ఇచ్చామో అంతే మొత్తం బ్రెవిస్ కోసం వెచ్చించాం. సీజన్‌లో మ్యాచులు జరుగుతుండగా ఎవరినైనా రిప్లేస్‌మెంట్ తీసుకుంటే అతడికిచ్చే మ్యాచ్ ఫీజు కూడా తగ్గే అవకాశం ఉంది" అని సీఎస్‌కే మేనేజ్‌మెంట్ స్పష్టత ఇచ్చింది. గుర్జప్‌నీత్‌ను మెగా వేలంలో సీఎస్‌కే రూ. 2.2కోట్లకే దక్కించుకుంది.

### ఇప్పుడు అశ్విన్ ఏమన్నాడంటే?

చెన్నై సూపర్ కింగ్స్ వివరణ ఇవ్వడంతో మరోసారి అశ్విన్ స్పందించాడు. ప్రజల్లో ఉన్న అనుమానాలను మాత్రమే తాను ప్రస్తావించానని.. ఇప్పుడు క్లారిటీ వచ్చిందని వ్యాఖ్యానించాడు. "ఈ సందర్భంగా నేనొక విషయం చెప్పదల్చుకున్నా. సోషల్ మీడియాలో జరిగే చర్చల కంటే నేను ఎక్కువగా క్రికెట్‌పైనే దృష్టి పెడతా. మా అభిప్రాయాలను తెలియజేయడానికే యూట్యూబ్‌లో వీడియోలు చేస్తాం. వాటిని చూసే వ్యక్తులు ఎవరూ తప్పులు చేయరు. చూడనివారు మాత్రమే తమ ఇష్టం ప్రకారం ప్రకటనలను వక్రీకరిస్తారు. ఇప్పుడున్న సమాజంలో ఒక ప్రకటన లేదా శీర్షిక ఆధారంగానే వార్తలను తయారైపోతున్నాయి. ఈ రోజుల్లో సరైన విషయాలకు స్పష్టత ఇవ్వాల్సిన అవసరంలేదు. ఇక్కడ ఎవరూ తప్పు చేయలేదు. చాలా మందికి అనుమానాలు ఉన్న ఈ విషయంపై స్పష్టత వచ్చింది. ఇక్కడ వాస్తవం ఏంటంటే.. ఫ్రాంచైజీ, ఆటగాడు, పాలకమండలి ఎలాంటి తప్పు చేయలేదు. ఆటగాళ్లను భర్తీ చేసుకోవడం ఎక్కడైనా సహజమే. ఆ ప్రక్రియలో ఏదైనా తప్పిదం ఉంటే సదరు ప్లేయర్ అసలు మ్యాచ్‌లను ఆడలేడు. నా పాత వీడియోలో ఎప్పుడూ బ్రెవిస్‌తో జరిగిన ఒప్పందంపై పొరపాటుగా మాట్లాడలేదు" అని అశ్విన్ ఈ వివాదానికి తెరదించాడు.




# భారత్‌లో ఐఫోన్ 17 తయారీ

ప్రముఖ టెక్ దిగ్గజం, యాపిల్ ఉత్పత్తుల సప్లయర్‌గా ఉన్న ఫాక్స్‌కాన్ భారత్‌లో ఐఫోన్ 17 ఉత్పత్తిని ప్రారంభించింది. రెండో అతిపెద్ద యూనిట్ అయిన బెంగళూరు ప్లాంట్‌లో ఈ సంస్థ పరిమిత స్థాయిలో మొబైల్ తయారీ చేపట్టినట్లు సమాచారం. 2.8 బిలియన్ (దాదాపు రూ.25 వేల కోట్లు)ల పెట్టుబడితో దేవనహల్లి సమీపంలో ఏర్పాటు చేసిన ఈ యూనిట్, చైనా బయట ఫాక్స్‌కాన్ ఏర్పాటు చేసిన రెండో అతిపెద్ద ఫ్యాక్టరీ. ఇది చెన్నైలోని యూనిట్‌కు అదనంగా కొనసాగుతుంది. ఐఫోన్–17 తయారీపై యాపిల్, ఫాక్స్‌కాన్ అధికారికంగా స్పందించాల్సి ఉంది.

# ఫాస్టాగ్ వార్షిక పాస్‌కు భారీ డిమాండ్.. తొలిరోజే 1.4 లక్షల మంది కొనుగోలు

జాతీయ రహదారులు, జాతీయ ఎక్స్‌ప్రెస్‌వేలపై ప్రయాణించే వాణిజ్యేతర వాహనదారుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఫాస్టాగ్ వార్షిక పాస్‌కు విపరీతమైన స్పందన వచ్చింది. తొలిరోజే సుమారు 1.4 లక్షల మంది వినియోగదారులు కొనుగోలు చేసినట్లు అధికారులు తెలిపారు. దేశవ్యాప్తంగా 1,150కి పైగా జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేల టోల్ ప్లాజాల్లో ఆగస్టు 15న ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. అదే రోజు సాయంత్రం 7 గంటల వరకు సుమారు 1.4 లక్షల వాహనదారులు ఈ పాస్‌ను కొనుగోలు చేసి యాక్టివేట్ చేశారు. 1.39 లక్షలకుపైగా లావాదేవీలు నమోదయ్యాయి. అదే సమయంలో రాజ్‌మార్గ్ యాత్ర యాప్‌లో ఏకకాలంలో 20 నుంచి 25 వేల మంది వినియోగదార్లు లాగిన్ అవుతున్నట్లు భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ తెలిపింది. రూ.3 వేలతో ఫాస్టాగ్ టోల్‌పాస్ తీసుకునే కార్లు, జీపులు, వ్యాన్ల యజమానులు ఏడాది పాటు లేదా 200 ట్రిప్పుల వరకు(ఏది ముందైతే అది) జాతీయ రహదారులపై ప్రయాణించవచ్చు. ఇది వ్యక్తిగత కార్లు, జీపులు, వ్యాన్లకు మాత్రమే వర్తిస్తుంది. వాణిజ్య వాహనాలకు చెల్లుబాటు కాదు. 200 ట్రిప్పులు పూర్తయ్యాక మళ్లీ రూ.3 వేలతో యాక్టివేట్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇలా ఏడాదిలో ఎన్నిసార్లైనా చేసుకోవచ్చు. ఇప్పటికే ఫాస్టాగ్ ఉన్నవారు మళ్లీ కొత్త ఫాస్టాగ్ కొనుగోలు చేయాల్సిన అవసరం లేదు. పాత ఫాస్టాగ్‌తోనే టోల్‌పాస్ యాక్టివేట్ చేసుకోవచ్చు. రాజ్‌మార్గ్ యాత్ర యాప్ వెబ్‌సైట్లలో అందుబాటులో ఉన్న లింక్ ద్వారా ఈ వార్షిక పాస్‌ను యాక్టివేట్ చేసుకోవచ్చు.



రాజముద్ర

www.rajamudranews.com

ప్రతి అక్షరం - ప్రజల కోసం

తెలుగు దిన పత్రిక



# ఇండస్ట్రీలో హీరోయిన్స్‌గా
# కొనసాగడం అంత సులభం కాదు

టాలీవుడ్ యంగ్ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ 'పరదా' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ప్రవీణ్ కంద్రేగుల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో సంగీత, దర్శన రాజేంద్రన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ ఆగస్టు 22న థియేటర్స్‌లోకి రాబోతుంది. దీంతో అనుపమ ప్రమోషన్స్‌లో ఫుల్ బిజీ అయిపోయింది. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొని సెన్సేషనల్ కామెంట్స్ చేసింది. "సినీ ఇండస్ట్రీలో హీరోయిన్స్‌గా కొనసాగడం అంత సులభం కాదు. చిన్న చిన్న విషయాలకే అటిట్యూడ్ చూపిస్తున్నారని అంటారు. మేము ఎంత తొందరగా సెట్‌కి వెళ్లినా లేట్‌గా పని మొదలుపెడతారు. అదే హీరోలు లేట్‌గా వచ్చినా అది తప్పు కాదు. కానీ నేను ప్రశ్నిస్తే పొగరు అంటారు. అలా అనడంతో గతంలో చాలా బాధపడ్డాను. ఇప్పుడు పట్టించుకోవడం మానేశాను. అదే విషయాన్ని దర్శకనిర్మాతలకు చెప్పినా సరైన సమాధానం చెప్పరు. గంటన్నరలోనే చాలా మాట్లాడుకోవచ్చు కానీ ఎక్కువ సమయాన్ని కేటాయిస్తారు. అదే విషయాన్ని హీరోయిన్స్ అడిగితే నా డబ్బులే కదా నీకెందుకు అంటారు. అదే హీరోలు ప్రశ్నిస్తే వారిని ఏమనరు. మహిళలతో కొందరు బయట ఎలా ప్రవర్తిస్తారో సినీ ఇండస్ట్రీలోనూ అలాగే చేస్తారు. ఏది చేసినా తప్పుగా చూస్తారు.ఇండస్ట్రీలో హీరోలకు ఇచ్చినంత ప్రాధాన్యత హీరోయిన్స్‌కు ఇవ్వరు" అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# రెండ్రోజుల్లో కార్మికుల సమస్య పరిష్కారం

## చిరంజీవితో నిర్మాత సి. కల్యాణ్ కీలక భేటీ



టాలివుడ్‌లో సినీ కార్మికులు తమ వేతనాల పెంచాలని గత కొన్ని రోజులుగా సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. ఫిల్మ్ ఫెడరేషన్ ప్రతినిధులు, నిర్మాతలు ఇప్పటికే కార్మిక సంఘాలతో పలు మార్లు భేటీ అయినప్పటికీ సమస్య పరిష్కారం అవ్వలేదు. దీంతో తాజాగా మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ సినీ కార్మికుల పంచాయితీ చిరంజీవి ఇంటికి చేరుకుంది. కార్మికుల సమ్మెపై సీన్‌లోకి చిరంజీవి ఎంట్రీ ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే ఆదివారం చిరంజీవితో నిర్మాత సి. కల్యాణ్ భేటీ అయ్యారు. సమావేశం అనంతరం నిర్మాత మీడియాతో మాట్లాడుతూ.. టాలీవుడ్ సమస్య పరిష్కారానికి చిరంజీవి తన వంతు కృషి చేస్తున్నారని తెలిపారు. రేపు ఫిల్మ్ ఫెడరేషన్ సభ్యులు చిరంజీవిని కలుస్తారని వెల్లడించారు. ఫెడరేషన్‌తో మాట్లాడి వారిని ఛాంబర్‌కు పంపిస్తానని చెప్పారని స్పష్టం చేశారు. ఫిల్మ్ ఛాంబర్, ఫెడరేషన్ కలిసి చర్చించుకోవాలని, ఇరువైపులా పట్టు విడుపు ఉండాలని చిరంజీవి చెప్పారని వివరించారు. దీంతో రెండ్రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందని భావిస్తున్నట్లు అభిప్రాయపడ్డారు. ఈ సమస్య పరిష్కారం కోసం ఛాంబర్ ప్రెసిడెంట్ భరత్ కూడా కృషి చేస్తున్నారని అన్నారు. ప్రొడ్యూసర్ ఉంటేనే సినిమా ముందుకు వెళ్తుందని, అందరికీ ఉపాధి దొరుకుతుందని నిర్మాత సి. కల్యాణ్ చెప్పుకొచ్చారు.



# కుర్ర హీరోయిన్లకు గట్టి పోటీ ఇచ్చేందుకు
# రంగంలోకి కాజల్ అగర్వాల్

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. 'లక్ష్మీ కళ్యాణం' సినిమాతో తెలుగు ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చి.. తన ఫస్ట్ మూవీతోనే మంచి గుర్తింపు సంపాదించుకున్నది. అలాగే తన అందం, అభినయంతో ఆకట్టుకుంది. దాదాపు స్టార్ హీరోలందరి సరసన నటించి మెప్పించింది. ఇక కెరీర్ పీక్స్‌లో ఉన్నప్పుడే బిజినెస్ మ్యాన్ అయినటువంటి గౌతమ్ కిచ్లూను ప్రేమించి పెళ్లి చేసుకుంది. అలాగే ఓ బాబుకు జన్మ కూడా నిచ్చింది. దీంతో సినిమాలకు గ్యాప్ ఇచ్చిన ఈ భామ 'సత్యభామ' మూవీతో మళ్లీ రీ ఎంట్రీ ఇచ్చింది. 'సికిందర్', కన్నప్ప సినిమాలతో మన ముందుకు వచ్చింది. బాలీవుడ్‌లో కూడా నటించి ఈ అమ్మడు ప్రేక్షకుల్ని అలరించింది.ఈ నటి సినిమాల్లో తక్కువగా కనిపిస్తున్నప్పటికీ.. నిత్యం సోషల్ మీడియా మాత్రం యాక్టీవ్‌గా ఉంటుంది. ఈ బ్యూటీ తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఓ పోస్ట్ పెట్టింది. కుర్ర లుక్‌ను తలపించేలా అదిరిపోయే ఫొటో షూట్ చేసింది. ఈ పిక్స్ వీక్షించిన నెటిజన్లు కుర్ర హీరోయిన్లకు గట్టి పోటీ ఇచ్చేందుకు రంగంలోకి దిగనుందా? చెమటలు పుట్టిస్తుందిగా అంటూ కామెంట్ల మోత మోగిస్తున్నారు.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com